# ఆకాశవాణి

పత్రికాధిపతులు

అయ్యగారి బాపిరాజు

సూరంపూడి సత్యనారాయణమూర్తి

Vol. 1. } రాజమహేంద్రవరము. 3. జనవరు. 1913. { No. 5.

## ఎంతఘోరము! ఎంతనింద్యము!

కరుణామయుఁడైన శ్రీహార్డింజిప్రభువునకొనర్చిన ఘాత.

హిందూదేశము ధర్మభూయిష్టపరులైనట్టియు శాంతస్వభావులైనట్టియు మునిశ్రేష్ఠుల సంతతిచేఁ బ్రకాశించుచుఁదన శాంతస్వభావమును ఆర్యధర్మములును విదేశీయుల కుత్తమోదాహరణీయంబులుగాఁ జేసి ప్రసిద్ధిఁ గాంచియుండెఁ దుదకిట్టి దుండగులకు నిలువనీడ నిచ్చుటఁజూడఁ దలక్రిందఁ ద్రాచు నిడికొని పరుండినటులున్నది. దేశమొక సంవత్సరము నుండి శాంతమునొంది శ్రీమోర్లేప్రభువుచేఁ బ్రసాదింపఁబడిన నూతనచట్టముల యొక్క ఫలితముల ననుభవించుచుండ గతనెల 23 తేదీని గరుణామయుఁడైన శ్రీహార్డింజిప్రభువుగారిపై ని బాంబుఁ బ్రయోగించుట మనకు

మితిలేని సంతాపమును దేశపురోవృద్ధికి విఘాతమును గలిగించినది. హిందువుఁడైననుఁ గాకున్నను నెవఁడో మతిభ్రష్టుఁడు కారణముగ నిట్టి ఘోరకృత్యము నొనరించుటవలన దేశమునకు రానైయున్న లాభము లన్నియుఁ బోవుటయేకాక దేశీయులందఱును దొరతనమువారి యాగ్రహ దవాగ్నిపాలఁ బడఁదగినవారై యున్నారు. భారతీయుల సాధుస్వభావ మునకును సత్యసంధతకును విరుద్ధమైన యిట్టికార్యములు దేశారిష్టములని నిస్సందేహముగఁ జెప్పఁదగును. ఇట్టిఘాతకులనుఁ బురిగేరినటులు శోధించి పట్టుకొని మడియింపఁజేయుటలో దొరతనమువారికి తోడ్పడుట మనకు ముఖ్యధర్మము!

ఢిల్లీనగర ప్రవేశోత్సవసమయమున దయాళుడైన శ్రీహార్డింజి ప్రభువుగారు రాజప్రతినిధిగా సింహాసనమలంకరింపనై శ్రీహార్డింజిప్రభ్వి ద్వితీయుండై దర్బారునకేగుచుండ నాపితికిపంద యెవఁడో భారతమాతృ నిర్మలయశోకౌముదికి కళంకముదే సమకట్టనెంచి యీబాంబు ప్రయోగ మనెడి దురంతమొనరింపసాహసించెను. శ్రీజార్జిచక్రవర్తిగారు మనదేశ మునుఁ దమపంచప్రాణములలో నొకటిగా నెంచి స్వయముగ దర్శన మిచ్చి జనానురంజకముగ హస్తిపురమందుఁ బట్టభద్రులై వారిచట నొసఁగిన సందేశము ప్రజలకెంతయో యాహ్లాదమును సంతుష్టియు నొన రించుటయేకాక దేశమందెల్లెడలను రాజభక్తినెలకొల్పినది. రెండు సం॥లు క్రితము దేశమల్లకల్లోలముగా నుండిన పుడు దొరతనమువారి నిర్బంధశాస నాస్త్రములు తమవాడినిఁ జూపుటకు మాఱుగ దేశపురోవృద్ధికాధార ములగు రాజకీయసంస్కరణము లాచరణములోనికిఁ దేబడినవి. ఈసంస్క రణలుపాలకులనుఁ బాలితులనుఁ బరస్పరమైత్రితో నుండునటులఁ జేసిన వనుట ముమ్మాటికిని సత్యము. నిజమైనహిందువుఁడు నీతిఁగల హిందువు డెవ్వఁడు నిట్టిదుండగమును సహింపనేరఁడు. ఇట్టిసమయమందాంగ్లేయ రాజకీయపారంగతులీ ఘాతఁవలంచి హైందవులెల్లరు నిట్టిహీనులేయని

యెంచి తమశాంతదాయకమగు పద్ధతులనుండి మఱలకుండెదరు గాక యని ప్రార్థించుచున్నాము. భారతీయయువకులందఱుఁ దమ యౌవనమును బుద్ధిబలమును నిట్టిదుండగములందు వినియోగించక దేశపురోవృద్ధికరము లగు పనులందు ప్రవేశింపఁజేసి దేశక్షేమమునకై తమజీవితమును ధార వోసి తమకునుఁదమ్ముఁబాలించు నాంగ్లేయప్రభువులకుఁ గీర్తియు నాహ్లాదమును గౌరవముఁ గలుగఁజేసెదరు గాక!

శ్రీహార్డింజిప్రభువుగారు శీఘ్రముగా దమశరీరమునందలి గాయములు మాని స్వస్థతనొందుచున్నందులకు సర్వభూతదయాళుఁడైన యప్పరమేశ్వరునకు నాహ్లాదకరముగ ననేకవందనము లాచరించుచున్నాము.

---

# ఆర్యావర్తమునందలి గురుశిష్యసాంప్రదాయము.

పూర్వకాలమునందు భారతీయు లితరదేశీయులందఱికంటె నెక్కుడగు బలమును ధైర్యమునుఁ బరాక్రమంబును శాంతమును నౌదార్యమును నైకమత్యమును విద్యయును బుద్ధియునుఁ గలిగి సమస్తఖండనివాసులచేతను వందనీయులునుఁ బ్రబలోదాహరణీయులునై వృద్ధిపొందుటకు కారణమేమి? సర్వజనసంస్తవనీయములైన తమతమ స్వధర్మముల నమితభక్తితోఁదలఁ దాల్చి యాచరించుటయే ముఖ్యకారణము.

తొల్లింటికాలమునందు భరతఖండమునందలి యార్యులు నాలుగువర్ణములవారుగా విభజింపబడిరి. అందు మొదటి మూడుజాతులవారును ద్విజులనఁబడిరి. ఈద్విజులు తమకుకలిగిన పుత్త్రులకేడేండ్లు వయసువచ్చినపిదప నుపనయనము నొనరించి నాఁటనుండియు నావటుల నుత్తమగుణగరిష్ఠులైనసకలవిద్యాపారంగతులగు గురవుల కొప్పగించి వారియందు తమకుఁగల బాధ్యత నంతటితో నొకించుక సమాప్తిఁ జేసుకొనుచుండిరి. అప్పుడీ బ్రి

హ్మచారుల దమకడుపాఱఁ గన్నకొడుకులవలె నీగురువులును గురుపత్నులు నమితజాగ రూకతతోఁ గాపాడుచు నుత్తమగుణములలవడఁజేయుచుఁ బాత్రానుకూలమగు విద్యలను నేర్పుచుండిరి. ఇవ్విద్యార్థులునుఁ దమతమ యుపదేశికులచే నాజ్ఞితులు కాకుండ నెన్నఁడేనియుఁ దమపితృగృహంబులకేఁగక యాగురువులభార్యలను గురువులనుఁ దమతల్లిదండ్రులటులు ప్రేమించి పూజించుచువారేపనిఁ జెప్పినను దలఁదాల్చి చేయుచు ననుదినమును మాధుకరవృత్తి నొనరించుచు నాహారమును సంపాదించుకొని యాసంపాదించినదానిని గురువునకు చూపించి యందు వారు వలదన్నదానిఁ బరిగ్రహించి యనుమతించినదానినే భుజింపుచు భూతలశయనులై కాయకష్టములకోర్చి విద్యలనుఁ గఱచుచుండిరి. వారేవిద్యనైనను సాంతముగాఁ జదివినచోఁ గొంచెమించుకఁ బండ్రెండేండ్లకాలము పట్టెడిది. ప్రతివిద్యార్థియును నేదేనియొకశాస్త్రమునందు పూర్ణుఁడుఁగాక గురునెడఁబాయఁ గూడదు. ఇంతకాలము నీవిద్యార్థులు పైనిచెప్పినప్రకారము విద్యాభ్యాసముసల్పుచు నెడతెగని బ్రహ్మచర్య మనుభవించుచుండిరి. ఇటులీ శిష్యులు పరిపూర్ణులైనవెనుక నట్టివారిని గురులు కనిపెట్టి సపత్నీకులై సాదరంబుగ నాశిష్యులకు స్నాతకి మొనరించి యంతటినుండియు నాసేతుశీతనగపర్యంతముంగల దేశాటమొనరించి రాఁబంపుచుండిరి. ఇట్లుగురులచే వీరుపంపఁబడునప్పటికి కించుమించిఱువది లేక యిరువదిరెండేండ్లు ప్రాయముఁగలవారగుదురు.

ఈవిద్యార్థులలోఁ గొందఱు తమ జన్మాంతరపుణ్యఫలమునఁ జేసి ఐహికాముష్మికకళాపరిపూర్ణనిరాడితులై స్వలాభనర్షితులై యీషణత్రయమూలమైన సంసారసుఖమ నపేక్షింపక గురుసమ్మతిని సన్యసించి యతిధర్మమును స్వీకరించి సర్వదా (ఆమరణాంతమును) దేశాటన మొనరింపుచు నాయాదేశములంగల యాచారములు నవి కాలవశతంజేసి పొందినమార్పుల నెఱింగి యందులఁగల దోషములను సంస్కరించి ప్రజలనటు లాచరింపఁ జేసి సర్వజనానురంజకులై రాజులచేతఁ బూజింపఁబడుచుండిరి. వీరినెల్లరు నాచార్యులని సద్భక్తితోఁ బూజించుచుండిరి. ఈపరివ్రాజకులే రాజకీయవ్యవహారములందును ఆర్యధర్మముల బోధించుటయందు నసమానప్రజ్ఞానిధులై రాజులకు దక్షిణభుజములటులుండి తమ యావచ్ఛక్తిని వినియోగించి దేశము నధర్మమునుండి తొలఁగించి నిరుపద్రవముగ నొప్పునటులు చేయుచుండిరి. ఇట్టివారలేకదా తొల్లింటికాలమునందు సుప్రసిద్ధులై సర్వజనవందితులై మహిమాతిశయులై యనిందితవర్తనులై యనివార్యమైన తమబుద్ధిబలమును నెఱపి

సకలజనసమాదరణీయములగు ధర్మముల నుపదేశించి విదేశములందు గూడననన్యోపమా నకీర్తిని సంపాదించి నేఁటికిని బ్రతికియున్నటు లెన్నఁబడుచుండిన విద్యారణ్య, శంకరాచార్య, రామానుజ, రామకృష్ణపరమహంస, వివేకానంద, దయానందాదప్రభృతులు.

అహో! సోదరులారా! సకలసద్ధర్మముల కాలవాలమైన మన భరతఖండమందు కాలవైపరీత్యమువలన రానురానీధర్మములు నిర్జీవములైన తాళపత్రపుస్తకములంగాని కాకితపుహొత్తములలోఁగాని దృశ్యాదృశ్యముగ నొప్పుచు నందుండఁబ రాతనగృహంబులలోఁ జీకటికొట్టులందలి చెమ్మనేలఁగల మూలలఁబడి క్రిమికీటకాదుల వాతఁబడి పీడింపబడి క్షీణించుచున్నది

కాని యీధర్మములు పాశ్చాత్యదేశీయులచే నతిగౌరవంబుగఁ జేకొనఁబడి కొద్ది మార్పులను మాత్రమే పొంది వారివారి భాషాంతరీకరణనామములచే నొప్పుచు నుత్కృష్ట పదవిం బొంది యాచరింపఁబడుచున్నవి. ఇటులు ప్రతిబాలునకు నుపనయనమాదిగా దేశాటనాంతముగాఁగల ధర్మములను ఋషులు బ్రహ్మచర్యమనిరి ఆబ్రహ్మచర్యము నాంగ్లేయులు మూడుతరగతులుగాఁ జేసిరి. అదెట్లనిన—ఉపనయనము మొదలుగా గురుకులవాసానంతరమువఱకుంగల ధర్మములను బోర్డింగు (Boarding) అనియునుఁ దరువాతను దేశాంతరగమనధర్మమును టూరింగు (Touring) అనియును దేశోద్ధారకార్యమై యవివాహితులై సన్యసించి స్వమతసేవం జేయుచుఁ దిఱుఁగు మతాచార్యులను మిషనరీలు (Missionaries) అనియును సామాన్యముగాఁ జెప్పుచున్నారు మున్ను మనయందుఁగల యీయాచారముల నాగరయు నీభరతఖండమునఁ బుట్టిన యార్యసంతతిలోనివాఁడయిన ప్రతిమనుష్యుఁడును నిగమనిగమాంత శాస్త్రపురాణేతిహాసార్థరచనా ధురంధరుఁడై యీజంబూద్వీపమందలి సకలప్రదేశములంగల పాలకులనుఁ బాలితులను వారివారిధర్మములను నందలి కష్టసుఖములనుఁ జక్కఁగ నెఱింగి దేశకాలపాత్రానుకూలుఁడై దేశమందలి లోపాలోపముల బాలకులకెఱింగించి యవసరానుకూలాలోచనలఁ జెప్పి ముప్పులఁ దప్పించి యొప్పులఁ జేయించుచు నాధ్యాత్మికధ్యానతత్పరుఁడై యిహపర సుఖములం దసమానప్రజ్ఞఁ గలిగి దేశమునకు శిరోభూషణమై యుండెడివాఁడు.

నేఁటికాలమందలి విద్యార్థులు పూర్వులవలెఁగాక సంస్కృతజ్ఞానశూన్యులై మన శాస్త్రములను వాటిలోఁగల చమత్కృతులనుఁ దెలిసికొనఁజాలక యజ్ఞానాంధకారపటల నిమగ్నులై తచ్ఛాస్త్రములనే యభ్యసించిన పాశ్చాత్యులచేఁ బ్రచురింపఁబడిన స్వల్పవిష

యములనే మహాంశములుగాఁ దలఁపోసి వారినే కేవలవ్యాసాదులుగా నమ్మి, భజింపఁదలసినవారైరి. ఆహా! కాలమహిమ! భారతీయవిద్యార్థులారా! మీరిప్పుడైనను మేల్కాంచి యప్రమత్తులరై మీ యపనమ్మకమునుఁ దిగఁద్రావి పడినచోటుననే వెదకి కొనుమనునటులు మనశాస్త్రములను విశ్వసించి సంస్కృతజ్ఞానమును సాకల్యముగ సంపాదించి సర్వశాస్త్రపారంగతులై యందలివిషయములఁ జక్కఁగ బరిశీలించి యాచరణయం దిడికొని వృద్ధిపఱిచి స్వలాభమును దేశాభివృద్ధియు నొనర్చి మనపూర్వులవలెనే యుత్తమమార్గవర్తనులై రాజభక్తియును దేశభక్తియును దైవభక్తియును గలిగి రాజ్యధర్మములను స్వధర్మములను సమానముగ నెఱపుచుఁ బాలకులకు మీయందు నమ్మకమును దయయునుఁ గలుగునటుల వర్తించి శుభములఁ గనుఁడు.

ఆటకుతగినదే యోటుమద్దెలనునటు లిక్కాలానుకూలముగ నాచార్యులును కుత్సితులై యనవసరములైన ఆంక్షలు ప్రాయశ్చిత్తములు మొదలగునవి యకారణముగఁ గల్పించి తమగౌరవమునుఁ బోఁగొట్టుకొని వారిగౌరవమునుఁ బోఁగొట్టి భ్రష్టులై సర్వజననిందితులైయున్నారు. కాని దేశక్షేమమున కించుకేనియును సహాయకారులు కాకయున్నారు. విద్యాహీనులై యాలిమీఁద గోపమువచ్చి కొందఱును బుత్త్రులమీద గోపమువచ్చి కొందఱును ధనసంపాదనార్థమై కొందఱు నుపన్యసించి పరమపవిత్రములైన యాచార్యపీఠముల నలంకరించి జనవిరోధులై తాజెడ్డకోఁతి వనమెల్ల జెఱచెనన్నటులు తాము పాడగుటయేకాక ప్రజలఁగూడ బాడుచేయుచున్నారు. ఇవియేనా మున్ను పరివ్రాజకులాచరించిన విధులు! ఇటులే వీరునడచుకొనుచుండిన యెడల వీరిగురుత్వము నిలుచునా? ఆర్యులవలెనే వీరును జేయఁబూనినచో వీరు ప్రజలకు సలుపవలసిన ధర్మంబు లెన్నిలేవు? అందు సహస్రాంశమైన నిప్పటికి సన్యాసులాచరించుచుండిరా? ఓదండపాణులారా! మీరు చేయవలసిన విధు లనంతములు. పవిత్రములైన శ్రుతిస్మృతుల దఱిచి యందలిసారమును జనులకు బోధించి ప్రజలను ఋజుమార్గవర్తకులుగా జేయుభారము మీదనున్నది!

ప్రస్తుత మీసందర్భమునఁ గృతిపతి యగు రఘునాథరాజుం గూర్చియు, ఆకాల మందలి స్థితిగతులం గూర్చియు, గ్రంథమునందలి యాయావర్ణనాంశముల నిశ్చయా నిశ్చయములం గూర్చియు, కవి యుద్దేశాదులం గూర్చియు, నించుక విచారించుకొనుట కొంతవఱకు నావశ్యకమే కావున నవ్విషయ మీక్రింద సంగ్రహముగా నరయం దగు.

"సీతాదృఙ్నృహరాంఘ్రిసేవానిధికిన్"

అని చెప్పుటచేత రఘునాథరాజు శ్రీరామభక్తుం డగు వైష్ణవమతస్థుం డయ్యును—

"శా. ప్రాగల్భ్యంబున విష్ణుశంభుమతముల్ పాటించి సర్వంసహా
భాగంబందు సమప్రధానగతి నొప్పున్ ........"

అని పీఠికలో నతనింగూర్చి వర్ణించి యుండుటచేత సర్వమతసమ్మతుం డని తేలుచున్నది. ఆతనితండ్రియు, తాతయు రంగనాథుని సేవించి రను మొదలగువానింబట్టి వైష్ణవభక్తి కలవారే కాని మతాంతరద్వేషు లని యూహింపనై యున్నది. కృతిపతితండ్రి "మణితులాదికమహాదానావళుల్ సేయ" అనఁగాఁ దనశరీరభారమునకు సరిపడఁ దూచి మణులు బ్రాహ్మణులకు దానము చేసె నని యభిప్రాయము. ఇట్టియాచారము మనలో మొన్నమొన్నటివఱకును గలిగియున్నది. రాజమహేంద్రవరమునఁ బ్రసిద్ధి వహించిన కొచ్చర్లకోట వేంకటరాయణంగారు కాంతాసహితులై యట్లు తులాభారములు తూఁగి బంగారు వెండి రాగి మొదలగుద్రవ్యము దానము చేసిరఁట. ఆకాలమందే వీరిని బరిహసించుటకై సర్వప్ప యనుకోమటిసెట్టి వంకాయలతులాభారము తూఁగి యవి దానము చేసె నని చెప్పుదురు. ఇట్లు తూఁచి దానము చేయుటకన్న ధనవంతు లైనవారు తమశక్తి కొలఁదిగ ధనము సత్కార్యములకు వెచ్చపెట్టి లోకోపకారపారీణు లగుటయే యుక్తము మని నాయభిప్రాయము.

"సీ. అరిదిసింగపుఁబల్ల మలరించె నేరాజు మేలుతేజికిఁ బదివేలు సేయఁ
జికిలిబంగరుకెండు పికిలిపచ్చలయందలం బెక్కె నేరాజు లక్ష సేయఁ
గనకమయంబుగాఁ గట్టించె నేరాజు సాటిలేనినగళ్ళు కోటి సేయఁ
గంఠమాలిక మొదల్గాఁ బెట్టె నేరాజు గొప్పసొమ్ములు పదికోట్లు సేయ.
గీ. నతఁడు ప్రభుమాత్రుఁడే బహుశాగ్రహార
నిత్యసత్రమహాదాన నిరతపోషి

తాహిమాచలసేతుద్విజానకీర్ణ
పుణ్యవిభవుండు రఘునాథభూవిభుండు.''

సీ. కుందనపుఁబసిండికుళ్ళాయి జిగలపైఁ జౌకట్లనిగనిగల్ చౌకళింప
హురుమంజిముత్యాల యరచట్టపై గొప్పపతకంబుహారముల్ పరపవిల్ల
వెలఁ జెప్ప రానికెంపులవంక జముదాడి పీతాంబరంబుపైఁ బెరిమె నెఱప
గబ్బిమన్నెకుమార గండపెండారంబు జిగి పదాగ్రింబుపైఁ జెంగలింప.

గీ. దొరల మంత్రిలఁ గవుల నాదరణ సేయు
కరము కంకణకాంతి నల్గడల నిండ
నిండుకొలువుండెఁ గన్నులపండువు గను
లీవి నచ్యుతరఘునాథ భూవిభుండు.

అని విజయవిలాసకృతికయందుఁ జెప్పియుండుటచేత రఘునాథరాజు పదివేల వరహాలు వెచ్చించి తనయొక్క గుఱ్ఱముమీఁదిజీను సింహముఖరూపముగాఁ జేయించుకొనియె ననియు, లక్షవరహాలు వెలసేయు పికిలికుచ్చులు బంగారుదిండ్లు గల పల్లకి నెక్కి తిరుగు ననియు, కోటివరహాలు వెచ్చపెట్టి కనకమయముగా నగళ్ళు గట్టించె ననియు, పదికోట్లు వెల గల కంఠమాలికలు లోనగు సొమ్ములు, పసిఁడికుళ్ళాయి పోఁగులు ఆణిముత్యములతోఁ గుట్టించిన అరచొక్కా (వేష్టుకోటు) తొడిగి గొప్పపదకములు హారములు దాల్చె ననియు, **వేనవేలు** వెలగల పీతాంబరముల ధరించుననియు, కాలికి గండపెండారము లేసికొను ననియు, చేతులకుఁ గంకణాలు మొదలగునగలు పెట్టుకొను ననియుఁ దెలియుచున్నది. ఇట్లు చెప్పుటచేత మనహిందూరాజులకుఁ గల యౌన్నత్యము వెల్లడియగుచున్నది. ఇట్లు ధరించుట రాజలక్షణ మనియే చెప్పవచ్చును. దీనివలన మనహిందూదేశమందుఁ బూర్వకాలమునఁ మహాధన ముండునది యని తెలియఁ బడుచున్నది. ఇట్టి వేషము వేయుట తగ దని కొందఱు చెప్పుదురు గాని తగ దనుపాశ్చాత్యప్రభువులే యిపుడు తమదరించునాభరణములకుఁ గోట్లు వెచ్చపెట్టుచున్నట్లు గన్పట్టుచున్నయది. ‘‘భూషలు గావు మర్త్యులకు భూరిమయాంగదతారహారముల్’’ అని భర్తృహరిసుభాషితములందుఁ జెప్పఁబడి యున్నట్లు ఇత్యాదిభూషణములు భూషణములు కావనియు నింతసొమ్ము వృథా పల్లకు లోనగువానికి వెచ్చించుటకన్న దేశోపయోగకార్య

ములకే రాచ్చించుట న్యాయ మనియు, మనదేశమునం దగ్బరుఫాదుషాను మించిన మహానుభావుఁ డని ప్రసిద్ధివహించి నిగర్వచూడామణియై వాగ్గుణభూషణములను మాత్రము ధరించి నైజాముదేశమును బరిపాలించి కీర్తిశేషు లైనమహబూబ్ పాదుషా సర్వవిధముల నిప్పటిరాజమండలి కుపదేష్ట యనియుం జెప్పుచున్నాను. దీనింబట్టి విచారింపగా మనకృతిపతి యగు రఘునాథరాజు శృంగారాలంకారప్రియుం డని యూహింపనై యున్నయది.

మఱియు రఘునాథరాజు—అఖిలవిద్యావిశారదుం డయినట్లును, గ్రంథములు రచించినకవి యయినట్లును రసికాగ్రగణ్యుఁ డయినట్లును, మహాదాత యయినట్లును, రాజలక్షణలక్షితుం డయినట్లును, దయాసత్యశౌచములు గలవాఁ డయినట్లును, శౌర్యనిధి యయినట్లును—

“చ. అభినవభోజరాజబిరుదాంకుఁడు శ్రీరఘునాథశౌరికిన్ .........”

“మ. రసికుం డారఘునాథకీర్తిపతి .........”

“భరతవిద్యాధురంధరుఁ డౌట”

“గీ. రసికమాత్రుండె యంతఃపురప్రవీణ
సారసాత్క్యధరసుధారసలసదాశు
కవనవతముఖబహుకళాకలనతృప్త
బుధజనాస్థాని రఘునాథభూమిజాని.”

“ఉ. తా రసపుష్టిమై ప్రతిపదంబును జాతియు వార్తయున్ జమ
త్కారము నర్థగౌరవము గల్గ ననేకకృతుల్ ప్రసన్నగం
భీరగతిన్ రచించి మహి మించినవో నిఁక శక్తు లెవ్వ ర
య్యా రఘునాథభూపరసికాగ్రణికిం జెవి సోకఁ జెప్పఁగన్.”

“గీ. ఔర పెండ్లికి నేగిన ట్లనికి నేగి
యకుతంత్రంబు లివి యేమి లక్షమనుచు
లేక పోయంగ గెల్చుట నీకె చెల్లు
సమరనిశ్శంక రఘునాథ సాహసాంక.”

“ఉ. తప్పులు వేయు గల్గినను దాళును నమ్మినవారిపట్ల.........”

"ఉ. ఆనతి యిచ్చెనా యది శిలాక్షర మెవ్వని నేని మెచ్చెనా
వానిఁ గృతార్థుఁ జేయఁ బగవాఁ డయినన్ శరణంబు జొచ్చెనా
యానరు నేర మెంచక తనంతటివాని నొనర్చ నిచ్చెనా
యేనుఁగుపాఁడి యీఁను గలఁడే రఘునాథనృపాలమౌళికిన్."

ఇత్యాదులవలనం దెలియవచ్చుచున్నది. ఇందుఁ గొంతయతిశయోక్తి యున్నను గొంత యైన నిశ్చయ మని మనము నమ్మఁ దగు నని నాయభిప్రాయము. మఱియు నీపీఠికలో రఘునాథరాజును గూర్చి చెప్పినపద్యములవలన నాకాలమున దేశమునకు నెమ్మది లే దనియు ననేకయుద్ధములు రాజులకు జరుగుచుండు నవి యనియుఁ దెలియుచున్నది.

"సీ. అతులభూరిప్రతాపార్కదీధితి చేత గట్టిగాఁ గాకలు పుట్టు పిదప
ఘోరారిగళరక్తధారాతివృష్టిచే నాని దుక్కికిఁ బద నైనపిదప
హయఘట్టఖురపుటహల్యముఖంబున నంతట దున్నినయట్టిపిదప
మొలచిననీకీర్తి మొలకలు తఱుచుగా వెద వెట్టి పైరు గావించు పిదపఁ"
గీ. గాపు నిలుపరె వేతాళగణము నెల్ల
నట్టిపట్టుల కరిగి నీ వరుల నోడ
పాటు చేసితి వనుట యేపాటి తలఁప
సమరనిశ్శంక రఘునాథసాహసాంక."

ఇందుఁ బైరు పండించి గైకొనుటకును శత్రుసంహారపూర్వకజయమునకును సామ్యము గల్పించి చెప్పబడినది. ఎండలు మిక్కిలిగఁ గాచిన వెనుక వర్షము కురియు ననియు, భూమి నాని పిదప దుక్కికిఁ బద నగు ననియు, పిదప నాగళ్ళ దున్ని వెదఁ జల్లి మొలిపించి పైరు గావించి ఫలము నొందుదురని వ్యవసాయసాంప్రదాయ మంతయు యథానుక్రమముగా వర్ణింపఁ బడినది. దీనివలనఁ గవి తంజావూరునం దుండువాఁడై నను అప్పటికిఁ గావేరీనది కానకట్టు కట్టి కాల్వలనీరు పాఱించి భూములలో వరినారు నాటి పండించునభ్యాసము లే దనియు, వర్షాధారము వలననే యచటి భూములు పండుచుండు ననియుఁ దేలుచున్నది.

మఱియుఁ గృతికర్త యగు వేంకటరాజ కవి—"కృతి యొసఁగ గీర్తి గల దని మతిఁ దలంచి" అని చెప్పుకొని రాజు కోరకుండ గ్రంథము రచించి కృతి యిచ్చెఁ

గా వ్రన నితఁడు రాజానుగ్రహంబునుదానంజేసి కీర్తియు నపేక్షించినవాఁ డనియు, "తా రనపుష్టిమై" యనుపద్యమువలనను,

క. ప్రతిపద్యమునందుఁ జమ
 త్కృతి గలుగం జెప్ప నేర్తు వెల్లఁగృతి వై
 కృతిపాఠము బాధముగా
 క్షితిలో నీమార్గ మెవరికిన్ రాదు సుమీ.

అని చెప్పి యున్న యీపద్యము వలనను జెప్పినట్లు తెలుఁగుకవిత్వము చెప్పఁ గలవాఁ డయినను ఇట్లు చెప్పుకొనుటవలనఁ గొంతవఱ కాత్మశ్లాఘయందుఁ బ్రియముగల వాఁ డనియుఁ దోచుచున్నది కాని కవుల కిట్లాచారము గా వచ్చుచున్నది.

"ఉ. ఏలికమాత్రమే మహిమ నీశ్వరుఁ డే వివరించి చూడ నా
 పాలిటిరామభద్రుఁ డని బంగరుపూవులఁ బూజ చేసి''......

అని చెప్పుకొనుటచేతను:—

"ఉ. శ్రీరసభావముల్ దెలియఁ జెప్పఁ బ్రబంధము లెన్నియేని మీ
 పేరిట సంకితం బిడిన బిడ్డల నెందఱఁ బేరు పెట్టినన్
 దీరునె మీబుణంబు......''

అని చెప్పుటం జేసియు నితఁడు రఘునాథరాజుచే నన్నవస్త్రము లిచ్చి పోషింపఁ బడుచుండు వాఁ డనియుఁ గొంత యతిశయోక్తిం జెప్పువాఁ డనియు నూహింపనై యున్నది.

"గీ. అని సుధామధురోక్తుల నానతిచ్చి
 మంజులపదార్థభూషణాంబరకదంబ
 కరితురంగాదివాహనోత్కరము లిచ్చి
 న న్నసాధారణముగ మన్నన యొనర్ప''

ఇత్యాదిపద్యముల నితనియతిశయోక్తి స్పష్టపడుచున్నది. "పదార్థభూషణాంబరకదంబకరితురంగాదివాహనోత్కరములు'' ఇంతవఱ కొక్కసారి విచారించినచో నివి పద్యపూర్తికే వచ్చిన వని స్పష్టపడఁ గలదు "ఏలినందులకు నూడిద చేసితి'' అని తొలుతఁ జెప్పుకొనినవాఁ డిట్లు చెప్పుటవలనను నిజము కాదని తోచెడిని.

సీ. గీ. గర్వితారాతిమస్తకఖండనోద్ధ
రక్తధారానుషంగాతిరక్తధార
నిజకృపాణికఁ గావేటినీటఁ గడిగె
నిఖిలగుణశాలి రఘునాథనృపతిమౌళి''

ఇందుఁ జెప్పినవిషయ మెంతవఱకు నిజమో చెప్పఁ జాలము గాని విజయనగరాధీశ్వరుం డగుకృష్ణదేవరాయలు ఇట్లే తనఖడ్గమును గృష్ణానదిలోఁ గడిగినట్లు కొండొక సందర్భమునఁ జెప్పఁ బడియున్నది. కవుల కిట్లు వర్ణించుట యభ్యాసమో లేక యది నిజమో విచారింపవలసి యున్నది.

''గీ. పోఁకమ్రాకులమహిమ కప్పురపుటనఁటి
యానుఁదోటలసౌభాగ్య మంద కలదు
పరిబలయాక్తిక సౌధసంపదలమహిమ
వీటి రహి మెచ్చవలయుఁ బో వేయునోళ్ళ''

ఈపద్యమువలనఁ గవి నివాస మైన తంజావూరుమండలంబునఁ గొబ్బరితోటలు, పోకతోటలు, తమలపాకుతోటలు, అనఁటితోటలును మిక్కిగా నక్కాలమందు నున్నవి యని నిశ్చయింపఁ బడుచున్నయది. మఱియు నిత్యాదివిషయము లీగ్రంథమునుండి పెక్కులు చూప నచ్చును గాని మఱియొండొక్కచోట నెటనైనం జూపువాఁడనై ప్రస్తుత మావిషయము ముగించి కవిత్వమునకు వత్తము.

వేంకటరాజకవికవిత్వము—సరసంతమై యర్థగౌరవంబు గలిగి మృదుమధురశైలిం దగిలి సామెతలతో జాతీయములతో శబ్దార్థాలంకారములతోఁ గూడి సర్వజనాదరణీయమై రచనాచమత్కారసముంచితంబై యచ్చతెలుఁగుశ్లేషలు గలదై సజీవమై విరాజిల్లుచుండును. అచ్చతెలుఁగుపదములను బొందికగా గూర్చునేర్పితనికేఁ గుదిరినట్లు మఱి యెవ్వరికినిం గుదరఁ బో దని చెప్పవచ్చును. ఇది యిట్టిది కనుకనే రాజా ''ప్రతిపద్యమునందుఁ జమత్కృతి గలుగఁ జెప్ప నేర్తువు, ఒకటిఁ గా దన్నిటఁ బ్రయోజకుఁడ వీవు'' అని మొదలైన స్థలముల నత్యధికముగాఁ గవిని బొగడి యున్నాఁడు. తనయాస్థానమందున్న పండితకవు లందఱకన్న నితని మిన్నగాఁ జూచి యాదరించి యున్నాఁడని నిర్ణయింపవగు

మ. కరుణాలోకనముల్ జెలంగఁబదముల్ ♦ ఘల్ఘల్లనన్ మ్రోయుచుం
జెఱుఁగజ్జెల్ వరలన్ సుపాణులరుతం ♦ జెన్నొందకర్ణాంచితా
భరణంబుల్ మెఱయఁగ కటిస్థలమునన్ ♦ బంగారునూలొప్పనుం
దరలాస్యంబొనరింపవేడయను కృ ♦ ష్ణా! భక్తచింతామణీ!

మ. వరగోపీజనకామహేతువగుచున్ ♦ వందారు మందారమై
స్ఫురదిందీవరలోచనాంచలమునై ♦ పూర్ణేందుసంకాశమై
కరమొప్పారెడునీదుమోము సతమున్ ♦ కారుణ్యతఁజూపు సుం
దర। సంగీతవిలోల! పద్మవర! కృ ♦ ష్ణా! భక్తచింతామణీ!

శా. మీనాంకుల్ శతకోట్లుఁ బోలుదురె సా ♦ మీ మీస్వరూపంబుతో
భానుల్లక్షలుకోటులైన సరియే ♦ భావింపనీశోభకున్
నానాజంతువితానపోషణ! హరీ! ♦ నాచిత్తమందుండవే
చాసల్పార్శ్వములందుఁ గొల్వఁగను కృ ♦ ష్ణా! భక్తచింతామణీ!

మ. యమునాతీర వనాంతరంబున మహా ♦ హ్లాదంబుగా వేణువున్
కమనీయంబుగఁబట్టి యంగుళముతో ♦ గానంబుఁగావింప నా
గమవేత్తల్ సురలున్ మహామునివరుల్ ♦ గాంతాజనంబుల్ నగేం
ద్రములున్ వృక్షములున్ ముదంబుగనుఁ గృ ♦ ష్ణా!భక్తచింతామణీ!

మ. మరుబాణాహతికోర్వలేకయువిదల్ ♦ మానాధ! నీసేవకై
యరుదేరం గృపలేకకానఁబడక ♦ త్యాశ్చర్యమారీతిగా
గరితల్ తోషమునొందఁజేయుదువు నీ ♦ కారుణ్యమీరీతిదా?
సరివారున్నను నిట్లుఁజేయుదువె? కృ ♦ ష్ణా! భక్తచింతామణీ!

శా. భీతింగంసుఁడు లోకమంతయును ♦ వ్యాప్తింబొందునీ రూపముఁ
జేతోవీధినిఁదల్చు నాతనికి నీ ♦ సేవాధికుల్ బొందు ప్ర
ఖ్యాతంబైన పదంబునిచ్చితివి నీకానందమాచర్యనే
జాతింబొందిననేమి పూర్తిపడఁ కృ ♦ ష్ణా! భక్తచింతామణీ!

శా. వైరంబొప్పఁగఁజేసి చేదినృపునన్ ♦ భావింపసాళ్వాదులున్
వీరంబొప్పిన పౌండ్రికాదినృపులుం ♦ బేర్కొన్న భక్తాగ్రిమల్
జేరెన్నీపదమందు నట్టిపనులే ♦ చేయంగ నేఁజాలఁగా
నౌరా నన్నిఁక నెట్లుఁబ్రోచెదవు? కృ ♦ ష్ణా! భక్తమచింతాణీ!

మ. నినుఁజంపఁగఁదలంచిపూతన కసుక్ ♦ నేఁజొప్పఁగాఁజేరి తా
ఘనపీనస్తనదుగ్ధమీయఁగ రుణం ♦ గైవల్యముంజేర్చితౌ
యనయంబున్ నినుఁబెంచిపాలిడుచు నా ♦ హ్లాదంబుఁగాఁబ్రోచు నా
జనయిత్రిన్ మఱియెందుఁ జేర్చెదవు! కృ ♦ ష్ణా! భక్తచింతామణీ!

శా. ఏరూపంబున నిన్నుఁ బేర్కొనినసీ ♦ కిష్టంబగుంగావునన్
నేరంబుల్ ఘటియింతునీమది కినిం ♦ పేనా? దయం దెల్పవే
ఘోరాచారులఁ జంపనేమిపనియో ♦ క్రోధంబు లేకున్ననీ
సారార్థంబుల నెంచనేరకగుఁ గృ ♦ ష్ణా! భక్తచింతామణీ!

మ. కులహీనుండవు జారచోరుఁడవు స ♦ క్రోధుండవున్ మాయచేఁ
గలకాలంబుఁ జయించువాఁడవు రమా ♦ కాంతుండవై వేడ్కఁగా
నిలరాజిల్లెడు నీదుసేవకధనం ♦ బింకింపఁగాజేతునో
జలజాక్షా! యివిమంచివే తలఁపఁ గృ ♦ ష్ణా! భక్తచింతామణీ!

శా. సేవల్ జేసెడివానిఁ జేతువు సదా ♦ చింతింపనట్లౌను నీ
భావంబెవ్వఁడుఁ గాన లేఁడు గుణివా ♦ బల్ప్రేకలం బోవురా
జీవాక్షా! కలహంబు మంచిదని నీ ♦ చిత్తంబు రాజిల్లెడున్
సౌవర్ణాంబరధారి! కేశిహర! కృ ♦ ష్ణా! భక్తచింతామణీ!

శా. ఈలోకంబున నీదునామమె సదా ♦ యిష్టంబుఁగాఁ బల్కకం
గాలంబంతయు రిత్తవుచ్చుచు మహా ♦ కాంక్షాత్మతం గ్రూరతం
బాలాలోకనశృంఖలాన్వితులమై ♦ ప్రాల్మాలి దుష్టాత్మతన్
శైలప్రాయులమైతి మెట్లగునొ కృ ♦ ష్ణా! భక్తచింతామణీ!

"అయినచో నేనును చెప్పరాదు. నీవొకచెడ్డయుక్తిని చేసితివి"

"నిజము. నీవిదివరకే మాసహోదరి నర్ధాంగిగఁ జేకొంటివి. బంధువులకంటెను ప్రాణమిత్రులకంటెను భార్య ప్రియమైనదనిన నందాశ్చర్యమేమున్నది? దీనికేమిగాని నే నేసియో వంచనచేసితినంటివది యేది?"

"మీసోదరివయస్సును నాకడ దాచితిరి. లేదేని నాతోతప్పుగ చెప్పియుండవలయు. ఆమె నాకంటె పెద్దదివలెఁ గన్పట్టుచున్నది."

"అది యెట్లు? ఆమెవయస్సు పదకొండేండ్లుమాత్రమే. నీవామెను సరిగా చూచియుండలేదు."

"నీవు నమ్ముటలేదు గాని నేను చక్కగాఁ జూచితిని పోనిమ్ము. నేనింక నొకమారిపుడామెను చూడవచ్చునా?"

"నీకిష్టమున్నఁ జూడవచ్చును. కాని యామెనిటకు దీసికొనిరావీలులేదు. నీవు నాతోకూడ నామెసౌధమునకు రమ్ము. అట నొక గవాక్షముగుండ నీవామెను చూడఁగలవు"

చంద్రసేనుఁడట్లుచేసి కొన్నినిమిషములవఱకు జాగ్రత్తగ పరికించి చూచెను. అప్పుడును ఆమె తనకంటె పెద్దదిగ వెనుక కనపడిన రీతిననే గన్పట్టెను. చంద్రసేనుని హాస్యములాడుచున్న ప్రియమిత్రుఁడగు మోహనకుమారుఁడు పూర్వమువలెనే తనసోదరీవేషమును ధరించి యట్లు గన్పట్టెను. చంద్రసేనుఁడు నిరాశఁజెంది మఱునాఁడు "రాజకన్యక నాకంటె పెద్దదియగుటచే పరిణయమాడ నాకిష్టములేదు. సెలవుఁ గైకొనుచున్నాఁడనని చక్రవర్తికి వర్తమానమంపి యటనుండి బయలుదేరెను.

"అన్నయ్యా! నీవీహాస్యకార్యమును చాలసేపటినుండి సేయుచున్నాఁడవు. రాకుమారుఁడు వెడలిపోవుచున్నాఁడని వినుచున్నదానను" అని కమలావతి మోహనకుమారునితో ననియెను.

"సోదరీ! భయములేదు. నేనేగి యొకనిముషములో నాతనిఁగొని తెచ్చెదను. ఇఁక కొంచెము సేపొక్కింత నాచమత్కారమును జూపి వినోదింపనిమ్ము" ఇట్లు చెప్పుచు మోహనకుమారుఁడు గుఱ్ఱము నెక్కి యొక్కపరుగున చంద్రసేనునిఁ గలిసికొని యిట్లనియెను.

"బావా! వెళ్లిపోవుచున్నాఁడవేమి?"

"మీచెల్లెలు నాకంటె చాల పెద్దది. ఆమెవయస్సును గూర్చి నాకడ తప్పుగా చెప్పినారు"

"ఆమె చాల దుఃఖించుచున్నది. నిన్ను దక్క నెవ్వరిని వివాహమాడదఁట,

ప్రచురించిన తీరున నామె ప్రతిజ్ఞను నెరవేర్చుటచే నీవామెకుఁ బతివైనాఁడవు. అందుచే నీవామెను తప్పక నేఁడు పరిణయమాడవలయు. ఇఁక నామె యాడును గూర్చియా నీవు చెప్పుచున్నాఁడవు? నీవు చెప్పినదే నిజమైనను మీరిరువురును సమవయస్కులగుదురు. అందువలన నుపద్రవమేమియు లేదు. ఇంతేకాదు. నీవామెను పరిణయమాడకుండఁ బోయితివేని మావంశమున కెంతయప్రతిష్ట సంభవించునో యించుక యోచింపుము. స్వయంవరమున గెలుపొందిన యొకి రాజకుమారుఁడు మాకన్యను బరిణయమాడ లేదనిన మాకెంతయవమానము? కావున నేఁడు తప్పక మాపట్టణమునకు దయచేయ వలయును''

చంద్రసేనుఁడు మరలకమలావతి సౌధమునకు వచ్చెను. వివాహమొక్కరోజున మాత్రమే జరుపఁబడవలయుననియు అదియైనను రహస్యమనియు నచ్చటివారాతనికిఁ దెలియఁజేసిరి. చంద్రసేనుఁ డిదియొక యద్భుతమైన పద్ధతియని యనియెను గాని మోహనకుమారుఁడొకవంకను కమలావతిచెలికత్తె లొకవంకను నిదియామె నియమములలో నొకటి యని చెప్పియాతనిని నమ్మించిరి. పిదప చంద్రసేనుఁడందుల కించుక మెత్తఁడై యెను. ఆమెచెలికత్తెలే పురోహితులకు బదులుగనుండి వివాహము చేయించెదరనియు, నిదియుఁ గూడ నామె నియమములో నొకభాగమే యనియును దెల్పిరి. మరియు నా రాత్రియే దంపతులిరువురును గలిసికొనవలయుననియు అలంకరింపఁబడిన యొకగది యేర్పాటుచేయఁబడుననియు నుడివిరి. ఇదియంతయును చంద్రసేనునకు స్వప్నమువలె నుండి చాల కలవరపరుచుచుండెను. తుదకాతఁడు కొంచెము ధైర్యమును తెచ్చుకొని కమలావతిని గూర్చుండనియమించి యామెతో నిట్లు మాటలాడ నారంభించెను. "కన్యకామణీ! నీవు నానిమిత్తమై దుఃఖించుచున్నానని చెప్పి నీసహోదరుఁడు నన్ను మరల వెనుకకు తీసికొని వచ్చినాఁడు. నీవేలదుఃఖించుచుంటివి?''

"మీరు వెళ్లిపోవుచున్నారని విని విచారించితిని. నాశపథము ననుసరించి మీరు నాభర్తలైతిరి''

"నన్ను భర్తయని చెప్పుటకు నీకు సిగ్గువొడముచుండుటలేదా? నీవు నాభార్యవని యొవరితోనైనను జెప్పుటకు నేను చాల సంకోచింతును''

"అయినను నేను మీభార్యనే కాఁగలను''

"నీవు వయసువచ్చిన యువతివి. నేను బాలుఁడను. నీవు నావంటిబాలుని పరిణయమాడనని ప్రతిజ్ఞ పట్టియుండవలసినది''

"మీరీలాగంటను తిరుగఁ దీయకుండ నుండవలసినది. యిందేమైన తప్పుండెనేని మనమిరువురమును తప్పుచేసినవారమే''

"నీవు పదకొండేండ్ల బాలికవని నేను వినియుంటిని. మాయమ్మ చనిపోయిన పిదప రెండేండ్లపర్యంతము నేనొంటరిగ నుండవలసివచ్చినది. అందుచే నేనొకచిన్నబాలికను బరిణయమైతినేని ఆమెతో నాడుకొనుచు మాటలాడుచు వినోదింపవచ్చునని తలంచితిని. కేవల మాయభిప్రాయముతోడనే నేనిట కరుదెంచినాఁడను. నీవయసునుగూర్చి నీసహోదరుఁడు నాతో చెప్పియుండవలసినది"

"వారు నావయసును గప్పిపుచ్చినారా? లేదు. లేదు. పోనిండు. మీయంతట మీరైనను ఏలకనిపెట్టలేదు"

"నేనెట్లు కనిపెట్టఁగలను? మాయమ్మ జీవించియుండెనేని మొట్టమొదట ఆమె నిన్నుఁ జూచియుండును. పిదప నేనే నీశ్రమనంతయును తీసికొనియుందును"

అంతట చంద్రసేనుని మొగము విచారసూచకమై చిన్నఁబోయెను. అది చూచి మోహనకుమారుఁడు తనవేషము నిఁకఁగొంచెము తీసివేయవలయునని తలంచెను.

"మంచిది. ఈవివాహము మీకసౌఖ్యకరము గాకుండుగాక! ఇది బొమ్మలపెండ్లింటిదె. నేనింకొకరిని పెండ్లియాడుదును. లేకున్న నిట్లే పరిణయవిహీననై యుండి పోవుదును. మీరు కోరినట్లు పదకొండేండ్ల బాలిక నొకర్తెను మీకొఱకై సంపాదించెదను."

"నీవిప్పుడిట్లు చెప్పుచున్నదానవు. పిదప నేను నిన్ను పరిత్యజించితినని చెప్పి నాకపకీర్తిని దేఁగలవు"

"నేనట్లు చేయను. నామాట నమ్ముఁడు. నేనిదె సెలవుపుచ్చుకొనుచున్నాను"

అని యామె లేచెను. ఆకంఠస్వరము నొక్కించుక యానవాలుపట్టియును ఆసంభాషణలోని కొన్నివాక్యములు కొంచెమనుమానము గలుగఁజేయుటంబట్టియు నెవ్వరో రాజకన్యకవేషమును ధరించి తనను వంచించుచున్నారని చంద్రసేనుఁడు తెలిసికొని తానుగూడ లేచి యామెహస్తమును బట్టుకొనియెను. ఆహస్తము పురుషహస్తమువలె కఠినముగను బలముగను నుండెను. చంద్రసేనుఁడు బాగుగ పరీక్షించి చూచెను. తెలిసినది. ఆతఁడెవరు? మోహనకుమారుఁడు.

"నీవు వెళ్ళిపోవలదు. నీతో నెట్లుమెలంగవలయునో నేను నేర్చికొని ప్రయత్నించెదను. ఓప్రియా? మోహనకుమారీ! కొన్నిసంవత్సరములు గడచినపిదప మనోహరములగు నూనూగుమీసములతో నీవు నాప్రియభార్యవగుదువు" ఇట్లుచెప్పుచు నింతదనుక సందేహాంబుధి మునింగియున్న చంద్రసేనుఁడు తన ప్రియమిత్రునివేషమును లాగివైచెను. చక్రవర్తియు మొదలగువారీ వృత్తాంతమును విని కడుపుబ్బ నవ్వసాగిరి.

చంద్రసేనునకును నిజమైన కమలావతికిని పరిణయమహోత్సవ మతివైభవముతో

మొట్టమొదట మహామునినిదర్శింపఁగలిగినప్పుడెట్టి యానందము ననుభవించిరో అట్టియానందమునే మోహనకుమారుఁ డీనాఁడనుభవించెను. తమజీవితకాలములో నిట్టిమహాభాగ్యములభించెడి దినమొక్కటి వేఱెయుండదని యువ్వురు ననుకొనిరి.

ఒక నెలగడచిన పిదప మోహనకుమారునకుఁ దగిన కన్యను వెదకుటకై చంద్రసేనుఁడు చాలకాలము ప్రయాణము చేసెను. ఇందువలన దేశపర్యటనము వలన గలుగు లాభములును సుఖమును, వినోదములును ఆతనికి లభించినవి. హిందూదేశములో చాలభాగమాతఁడు తిరిగెను. పెద్దపెద్ద రాజ్యములు, పట్టణములు, రాజధానులు మొదలగునవన్నియు దర్శించెను. ఏయేస్థలమును చూచెనో, ఎక్కడెక్కడ నేయేకార్యము లానర్చెనో, ఎక్కడ తగినసంబంధమున్నదో, ఏకన్యనెట్లు చూడఁగలిగెనో, మోహనకుమారుని చరిత్రముతో సంబంధించిన కార్యములన్నియు నాతని స్వీయచరిత్రమున నీయఁబడును.

ఎనిమిదిమాసములు గడచిన పిదప కమలావతి కొకకష్టము సంప్రాప్తమయ్యెను. చంద్రసేనుఁడును మోహనకుమారుఁడును ఇంటలేనిరాత్రి నొకనాఁడు యాశ్వాసఘోష కలుగు పర్షియాదేశపు యవనులిరువదిమంది యాకస్మికముగ కమలావతియుండు సౌధముకడకరుదెంచి లోనికేగఁ బ్రయత్నింపుచుండ నమాత్యుఁడు చూచి వారినడ్డగించి యిట్లనెను.

"రాజకుమారా! ఆఁగుము. లోనికిఁ బోరాదు"

"పనియున్నదనియు, ఒకసారి రాఁజలసినదనియు రాణి నాకు వర్తమానమంపినది."

"ఇది కేవలమసత్యము."

"అట్లయిన మేము మెము బలిమిని గొనిపోవనచ్చితిమి."

వారు బాణములతో రణము సేయ నారంభించిరి. సౌధాంతర్భాగమునుండి యిదియంతయు చూచుచున్న మంత్రిఁదుని భార్య, రణవినోదమును జూచుటకు దయసేయుమని కమలావతిని వేఁడుకొనియెను. యుద్ధకారణము నెఱింగి రాణి విల్లునమ్ములఁ దాల్చి రణరంగమున కరుదెంచి గంభీరస్వరంబున నిట్లనియెను.

"ఓ మ్లేచ్ఛనీచుఁడా! నీవిఁక మంత్రితో యుద్ధము సేయవలదు. నీవునాకొఱకే తెంచితివి కావున నాతో రణమొనర్పుము"

"బాలికా! నీతోడనా? రణమా?"

"నీపినతండ్రి నొషర్‌వాన్ నాభర్తచే వధింపఁబడినాఁడు. ఆతని తనయుఁడు గొహార్‌జాందు మాయత్తగారిచే సంహరింపఁబడినాఁడు. ఆమెపై యరుదెంచిన యాయిరువురు నట్లు నాశనమైరి. అట్టి వీరికిపందల వంశమున జన్మించిననీవు లజ్జారహితుఁడవై యిప్పుడు నానిమిత్తము మేగుదెంచితివి. అందుచే నీవు నాచే చంపఁబడుదువు."

చంద్రసేనుఁడు నాతని మఱందియు నీరణోదంతమును విని యొక్కఁపటుగున వచ్చిరి కాని వారు చేరునప్పటికే కమలావతి శత్రుని తుండెతుండెములుగ నరికివైచినది.

పిదప నొకసంవత్సరమునకు కమలావతి పుష్పవతి యయ్యెను. మహామునిచే దాంపత్యధర్మములను జక్కఁగ నెఱింగినవాఁడు కావున చంద్రసేనుఁడింకొక సంవత్సరము గడచునంతకు నూరకుండి పిదప కమలావతింగూడి సమస్త సౌఖ్యముల ననుభవించెను. అప్పటికాతనికి పదునాఱేండ్లు. కమలావతికి పదమూఁడు.

---

## ఏడవ ప్రకరణము

### రాజ్యపాలనము.

ఇంద్రప్రస్థపట్టణమునకు పశ్చిమముననున్న హిందూస్థానమంతయు చంద్రసేనుని పాలనమునందుండెనని చెప్పవచ్చును. రాజపుత్రస్థాన (రాజపుతానా) పాంచాల (పంజాబు) కాశ్మీర (కాశ్మీరము) సింధు (సింధు) గాంధార (అఫ్గన్ బెలూచిస్థానము) మహారాష్ట్ర (బొంబాయి గుజరాతు మొదలగునవి) దేశములాతనియేలుబడియందుండెను. ఇంద్రప్రస్థపట్టణమునకు తూర్పుననున్న హిందూస్థానమంతయు వంగరాజ్యమను పేరున మొదటివలె నుండెను.

రాణికి ముప్పదేండ్ల యీడున, చంద్రసేనునకు ముప్పదిమూఁడవ సంవత్సరమునందు, నాదంపతులకొక కుమారుఁడుదయించెను. కుమారునకు పండ్రెండేండ్లు వచ్చువరకును రాజ్యమును చేసి పిదప చంద్రసేనుఁడు రాజ్యభారమునంతయు నాతనిపైనిడి యాదంపతులు విశ్రాంతి వహించిరి. పండ్రెండవయేడు మొదలు నలుబదియైదవవత్సరము వచ్చువరకును చంద్రసేనుఁ డీరీతిగ ముప్పదిమూఁడు సంవత్సరములు నిరాఘాటముగ రాజ్యమేలెను.

చంద్రసేనుఁడు తొంబదిసంవత్సరములీడు వచ్చువఱకును జీవించియుండెను. అతఁడు కూరలు, పండ్లు, అన్నము మాత్రమే తినుచుండెడివాఁడు. చేపలను గాని మాంసమును గాని యెన్నఁడును తిని యెఱుఁగఁడు. ప్రతిదినమునను చాలదూరము నడచియో, గుఱ్ఱముపై స్వారిచేసియో, బంతులాడియో, (Tennis) దేహపరిశ్రమ సేయుచుండెడివాఁడు. విశ్రాంతి కావలసినసమయముల వినోదోద్యానముల విహరించుచునో, మనోహరప్రదేశముల కేగుచునో, చతురంగము మొదలగు నాటలనాడుచునో, సంగీతము నాలకించుచునో, ప్రియభార్యతోగాని, మోహనకుమారునితోగాని సరససల్లాపములాడుచునో ఉల్లాసముగ కాలము గడపుచుండెడివాఁడు. అందుచేత (కేవలమదృష్టముచేఁ గాకుండ) నే యంతకాలము జిఱ్ఱుమని చీదనైనఁజీదక దేహదార్ఢ్యముతోడను ఆరోగ్యముతోడనుజీవింపగలిగెను.

చంద్రసేనుఁడు తనరాజ్యమున నుపయోగకరములగు నెన్నియో సంస్కరణలఁ బ్రవేశపెట్టెను. ప్రజలకై యెన్నియో సౌకర్యముల నొనర్చెను. తనపూర్వులు వ్యవసాయము చేయువారిపై విధించిన పన్ను లెక్కువగ నుండుటనుజూచి వానిని తగ్గించెను. వైద్యశాలలను గట్టించెను. అందులో నీటివైద్యముకూడ నొకటిగ నుండెను. బీదలకు ధర్మవైద్యశాలలను భాగ్యవంతులకు ద్రవ్యమును గైకొని వైద్యముచేయు పెద్ద వయిద్యశాలలను నేర్పరచెను. వైద్యశాలలు స్త్రీలకు పురుషులకు వేఱువేఱుగ నుండు నట్లేర్పాటు చేయించెను. మనదేశమున బాలికలకు విద్యాశాలలు నిర్మించినవారిలో నీతఁడు మొట్టమొదటివాఁడు. పర్వతములనుండి వచ్చు నిర్మలోదకమును మహాముని యుపదేశానుసారము జలయంత్రముల ముఖమున ప్రతిగృహమునకు వచ్చునట్లేర్పరచెను. అదియేమిపాపమోకాని మనయిప్పటివైద్యులు పర్వతోదకమును ద్రావఁగూడదనుచున్నారు. మహామునివద్దనుండి నేర్చుకొనిన పద్ధతి ననుసరించి పట్టణములయందలి వీధులలో వాయుదీపికలు (Gas lights) వెలయించెను. లండనుపట్టణమునకంటె వైశాల్యమునఁ జాల పెద్దదైయె వర్ణింపశక్యముగాని సొగసుగనున్న వల్లభపురమునందలి పారిశుధ్యము మరేపట్టణమందును గానరాదు. చేతితో వచ్చువ్రాయుముద్రాయంత్రము (Type writer) ను ధూమయంత్రమును (Steam Engine) ఆకాశవిమానమును నిర్మించుటాతనికిఁ దెలియునుకాని వానిని చేసియుపయోగమునకు దెచ్చుటకై మాత్రమాతఁడెన్నఁడును ప్రయత్నింపలేదు. అట్టిమహాకార్యములను చేసి లోకోపకారము చేయనందులకై మనమాతనిని నిందింపక క్షమింపవలసి యున్నది. ఆతనిధనమును శక్తియు నాతని పూర్వులు చేయనిమఱియొక మహాకార్యమునకై వినియోగించినాఁడు. కఱవుకాలమున బీదలను పోషించుటకై ధాన్యపుకొట్లనెన్నిటినో రాజ్యాంగమువారి పక్షమునఁ గట్టించి అందుండి ధాన్యము నుచితముగ పంచిపెట్టుచు వచ్చెను.

## అవసానము.

ఆతని యవసానమీరీతిగ సంభవమయ్యెను. ఆతనికి కొన్నిదినములు జ్వరమువచ్చి యది క్రమక్రమముగ నధికమయ్యెను. పిదప గుండెలలో దారుణమైననొప్పి యుద్భవిల్లెను. ఆబాధల నాతఁడు సహింపలేకపోయెను. ఇచ్ఛామాత్రమున ప్రాణములను విడుచుటెట్లో మహాయోగునివలన నెఱింగినవాఁడు కావున ననాయాసముగ నీ దేహమును విడిచిపెట్టెను. కమలాంబికూడ నావిద్య నెఱుఁగును కావున వ్యాధిలేకపోయినను ఆమెకూడ భర్తననుకరించి తన సతీధర్మమును నెఱపుకొనియెను.

చంద్రసేనుని మరణమునకై ఆతనికుమారుఁడును కుమార్తెయు మనుమలును మనుమరాండ్రును అందరికంటె నధికముగ నాతనిబంధువుఁడును స్నేహితుఁడును సోదరచక్రవర్తియు భావమరిదియునగు మోహనకుమారుఁడును చాల విచారించిరి. రెండురాజ్యముల యందలి ప్రజలలో ఆతనిచారిత్రమును గూర్చియు నాతనిఁగూర్చియు కంటతడిపెట్టకుండ చెప్పుకొనువా రొకరును లేకపోయిరి. వారిమాట యననేల ఎంతకాలమో గడచిపోయిన పిదప ఇప్పుడైనను మనమా మహామహునిచారిత్రమును మనహృదయము నీరయిపోకుండ మనోభావములచే మనశరీరముగగుర్పొడుచకుండ నేత్రములవెంట నశ్రువులు చిందకుండ చదువఁగలమా? చదువలేను. చదువలేము. ఆతనిజీవితము సంతోషవిచారములచే పరిపూరితమైనది. ఆపదలతోడను సాహసకృత్యములతోడను నిండి సర్వదా దైవముమీదనే భారపడియుండినది. అసాధారణమైనది. ఔదార్యవిరాజితమైనది. పరితృప్తి నొందినది. ఇంతేకాదు. లేశమాత్రమైనను కళంకములేనిది. అత్యంతనిర్మలము. అద్వితీయము.

సంపూర్ణము.

తే.గీ. దొంగపాటున నినునాఁడు ♦ తునిమినట్టి
యప్పఠానులశిరముల ♦ నాలమందుఁ
దునిమితద్రక్తధారల ♦ తోడనీకు
తర్పణము నేనొసర్చి మో ♦ దంబుఁగనుదు.

(నిట్టూర్పువిడిచి) ఇక్కార్యమునందా గౌతముఁడు నాకుఁ దప్పక తోడుపడి నప్పుడు నేనరులఁదునుమాడుటన్న నతిసులభసాధ్యంబగుఁగదా.

విదూష—(తెఱలో) అవునవును. రిపుమత్తమతంగశిరోరుకుంభవిదారణదారుణాశిలాంఛనుండగు నృసింహుండైన యభయచందుమహారాజున కసాధ్యమైనదెద్ది? (ప్రవేశించి సహర్షముగా) భంజితశత్రుమృగనృసింహా! నీవు సంకల్పసిద్ధుఁడవు. నిన్నతికాలములోపలనే విజయలక్ష్మియుఁ దన్మూలమున నర్ధాంగలక్ష్మియుఁ దమంతటతామై వచ్చి మెప్పించి వరింపఁగలవు.

అభయ—(మందస్మితాననుఁడై) అదిగో నాప్రియమిత్రుఁడగు వామనభట్టు సమయమునకే యిటకు వచ్చినాఁడు. ఇంద్రునకుఁ బృహస్పతివోలె నీతండును నాకిక్కార్యానుకూలయోచనాసహాయం బొనరించుటయం దనుకూలుండు కాఁగలఁడు.

విదూష—(చిఱునగవుతో) దేనియందు? పరోపకారంబని పెచ్చుమిగిలిన పచ్చితురకలఁ జంపుటయందా? లేక మచ్చకంటులచే నెనలేని మెప్పు వడయుటయందా?

అభయ—అవునీరెంటఁగూడ నీవు నాకు తోడుపడవలయుఁగదా.

విదూష—(పెదవి విఱిచి నిర్లక్ష్యముగా) ఇంతేనా?

అభయ—(సహర్షముగా) ఇఁక నెంతకావలెను?

విదూష—ఏమేమో సంతర్పణాలందో సమారాధనలందో బూరెలో గారెలో తృప్తిఁదీఱ నేతిలో ముంచి కడుపాఱఁదినుటయందేమో యనుకొంటిని.

అభయ—(చిఱునగవుతో) ఇంక నేమనుకొంటివి?

విదూష—పిదపఁ బండుతమలపాకుల విడెమును నోటినిండనములుచుఁ దేఁపు వచ్చునటులు పానుపుపై నిటునటుఁ బలుమాఱు లాయాసముఁదీఱఁ బొఱలాడి హాయిగఁ గుఱ్ఱుపట్టి నిదురించుటయందేమో యనుకొంటిని.

అభయ—(నవ్వుచు) ఓయీ! నిర్భాగ్యగామోదరచక్రవర్తీ! నీవీరెండును ఘనకార్యములనియా చెప్పుచుంటివి?

విదూష—సరిసరి. బాగుగనున్నది. ఆజన్మాంతరమును జీవులకు ముఖ్యాధారములైన యీరెండును ఘనకార్యములుకావా? ప్రతిప్రాణియును "శరీరమాద్యంఖలు ధర్మసాధన"మనునార్యోక్తి ననుసరించియుండునని నీవు వినియుండలేదా?

అభయ—కాదు. అది మూర్ఖవాంఛితము.

విదూష—సాధువాంఛితమిక నెద్ది?

అభయ—

చ. అరులను సంహరించుటయొ ♦ ఆర్తుల కాత్మభయంబుఁబాపుటో
సురుచిరవర్ణనీయమగు ♦ సూనృతమాడుటొ కాక ధాత్రిపైఁ
బురుషుఁడు నిద్రహారములఁ ♦ బొందుచుఁ గాలముఁబుచ్చన్యాయమే
కరమనురక్తిఁ గాకి కల ♦ కాలముఁ గుక్షికి మెక్కియుండదే?

విదూష—నీవుచెప్పినది నాకర్థముకాలేదు.

అభయ—తెలియఁజెప్పెదను వినుము.

తే. గీ. భారతీయుల వైరులే ♦ వైరులగుదు
రార్తులేపాటివారైన ♦ నాప్తులగుదు
రక్షులారఁగ గన్నదే ♦ న్యాయమంచు
నేఁదలంచెద నెప్పుడు ♦ నెఱుఁగుమయ్య!

విదూష—రాజా! ఇట్టికానితలంపులఁ జిక్కి యనవసరకష్టములఁ బొందకుము.

ఆ. వె. కనుపులోనిచల్ల ♦ కదలకుండఁగ నీడ
పట్టునందు నిలిచి ♦ బ్రతుకకన్న
కష్టసుఖములందుఁ ♦ గలుగఁజేసికొనినఁ
గలుగునేరికైనఁ ♦ గష్టములిల.

అభయ—ఓయీ! మందుఁడా! ఇదియా నీవునా కుపదేశించు మహోపదేశము

మ. జడమయ్యున్ ధరణీరుహంబనయమా ♦ చండార్కతీవ్రప్రభం
గను వర్షంబుల కోర్చి భుక్తిఁదనదా ♦ కష్టార్జితంబొప్పనె
ప్పుడు సంపాదనఁ జేసికొంచుఁబథికుం ♦ బొందింపదేసౌఖ్యమా
వడిఁగా మర్త్యుఁడు పుట్టినందులకు స♦ల్పంగావలెన్ సత్కృతుల్.

విదూష—ఇట్టులనియేకదా నాఁడు.

ఉ. భారతదేశనాశనులఁ ♦ బట్టి వధింపఁగఁ బోయి యందు దు
ర్వారబలాఢ్యుఁడై పృథివి ♦ రాజుగతించె సతీసమేతుఁడై

అభయ—

క్రూరుఁడు వంశనాశనుఁడు ♦ క్రూరకనోజి విభుండు గోరికా
పోరునఁ దోడుఁగానియెడ............(అర్ధోక్తియందు)

విదూష—

భూమిపతీ! కలరట్టివారలే.

అభయ—(అయిష్టముతో) వయస్యా! అట్టివారలఁగూర్చి నాకడనిఁక నెన్నఁడు బ్రశంసింపకుము.

క. జననీద్రోహుని కన్నను
దనమిత్రులఁజంపుకొను క్ర ♦ తఘ్నునికంటెన్
వినుదేశద్రోహిఁ జను
నసరాని మహాఘఫలమి ♦ హపరములఁ జుమీ.

విదూష—ఇంకనొకమాటఁ జెప్పెదను వినుము.

చ. నరపతి నీసహోదరుఁడు ♦ నాఁడు పఠానులబారినుండియు
త్తరుణులఁగావఁగాఁజని క ♦ దా తెగటాఱెను నొంటిరై కటా!

అభయ—

అరయుఁగ నార్తరక్షణకు ♦ నై తనజీవములిచ్చు వీరుఁడై
కరమునఁ గత్తిఁబూనుటకుఁ ♦ గానిలసార్థకమెప్పనాప్తుఁడా?

విదూష—(పరిహాసముగా) అహాహా!

తే. గీ. నేర్చుకొంటిని ధర్మముల్ ♦ నేఁడురెండు
నీదు సమ్ముఖమందున ♦ నేను వినుము
క్షితిఁ బరోపకారియనఁ న ♦ శించుటొకటి
వీరుఁడననరిచేఁ జెడ ♦ టారుటొకటి.

అభయ—(లేనగవుతో) ఓయీ! మందమతీ! ఇవియా నీవు నేర్చుకొనిన ధర్మములు?

తే. గీ. ధరఁ బరోపకారార్థమి ♦ దంశరీర
మనుచు నాచరణముసేయు ♦ మనుజవరులు
బ్రతికియున్నను లేకున్న ♦ నతులనుతుల
నొందుచుందురు నేఁటికి ♦ నున్నయటులు.

మఱియును.

తే. గీ. జన్మమెత్తినదానికి ♦ సార్థకముగఁ
బురుషుఁడౌదార్యశౌర్యసం ♦ పూర్ణుఁడగుచు
వీరుఁడై యుద్ధమందున ♦ వైరిజనులఁ
జంపవలెఁగాక తానైనఁ ♦ జావవలయు.

విదూష—దీనికేమిలెమ్ము. వేఱొకమాట నుడివెదను వినుము.

శా. అంధప్రక్రియ సత్యనిష్ఠతకునై ♦ యంతన్ హరిశ్చంద్రుఁడా
లిం ధాత్రిన్ సుతుఁబాసిదుఃఖితులనో ♦ లింబొందిశుష్కించె—
అభయ—... ... ... ... స
త్సంధుల్ ధీరులు ధర్మపోషణముకై ♦ తాల్మిన్ మదిం జెంది స
ద్బంధువ్రాతమునైన పీడిపడరే ♦ ప్రాపించుకష్టంబులన్.

విదూష—(పరిహాసముగా) అడుసుఁద్రొక్కనేల? కాలుఁగడుగనేల?

అభయ—(మందహాసముతో) ఓయీ! హీనబుద్ధీ! దీనఁజేసి నీవు గ్రహించినదిదియా?

చ. జగతివిభాగ్యభోగ్యముల ♦ శాశ్వతముల్ గద సత్యమొక్కటే
యగుఁగద శాశ్వతంబనుచు ♦ నార్యులు కష్టములెన్నివచ్చినన్
వగవరధైర్యమొంది తమ ♦ పట్టుదలన్ విడరెప్పుడిట్టులై
మిగులఁ బుటంబులంబడుట ♦ మేలిమియౌ కనకంబుకైవడిన్.

విదూష—(నవ్వుచు) కుమారా! చెట్టుముదిరినకొలఁది జేవ పెచ్చుమిగులు నటు

లు నిన్నుఁదలఁచి ప్రసంగించినకాలందిని నీయొక్క ధైర్యస్థైర్యగాంభీర్యపరాక్రమౌదార్యంబులు తమంతటతామై పైపబ్బి వెల్లడియగుచున్నవి.

అభయ—మిత్రమా! నేననవరతంబునుఁ ద్రికరణశుద్ధిగ నాచరించుచున్న వ్రతంబులును వాటిఁగూర్చి నామనోనిశ్చయంబుఁ గూడఁ దెలిపెదను. వినుము.

తే. గీ. అప్పరానులఁ జెగటార్చు ♦ టందుగాని
యార్త సంరక్షణముసేయు ♦ టందుఁగాని
యెలమి సత్యమువలికెడు ♦ నెడలఁగాని
వేయుసలుపఁ జీవముపైన ♦ విడుతుఁగాని

విదూష—ఆ గుణధర్మాచరణలయందు నన్నగారికీవు తమ్ముఁడవేయనిపించుకొనఁదగుదువు.

అభయ—(సవిచారముగా) సఖా! నీవిప్పుడన్నగారని యాదులచే నింతవఱకును నిగుఱుఁగప్పియున్న మదీయదుఃఖాగ్ని మఱలఁ బ్రజ్వలించుచున్నది. (రోషశోకములతో)

తే. గీ అన్ననవును నిష్కారణ ♦ మటవియందు
విగతజీవునిఁజేసిన ♦ పగతు నుసుఱు
లేముఁ బొరిఁగొనుదనుక నా ♦ మానసంబు
సతతమును మున్గియుండు వి ♦ చారజలధి.

విదూష—అవును. పాపము. • గోఁగుచుట్టుమీఁద రోకటిపోటనునటులీదుసనంబగని రాజ్యభారముఁగూడ. నీభుజసీమ నలంకరించినది.

(తెఱలో బిగ్గఱఁగా)

సీ. బలిమిని శిఖఁబట్టు ♦ వసువునఁ బొంచాల
మెంచితురకలాక్రి ♦ మించిరమ్మ!
కనుచోయిఁ బొడిచిన ♦ గతినిహస్తిపుర క
న్యాకుబ్జముల్ గొట్టి ♦ నారలమ్మ!
యిఱుఁగేలబంధించు ♦ కరణిని సింధువం
గముల రెంటఁగెలుపుఁ ♦ గాంచిరమ్మ!

తోరంపునగలెల్లఁ ♦ దోచి నటులు శిల్ప
వై చిత్రిములనెల్లఁ ♦ దోచి రమ్మ?

తే. గీ. అప్పరానులచేఁ బడి ♦ యడరుచుండ
నకట! భారతపుతుత్రిలై ♦ నట్టివీరు
డనదగతినిన్ను విడనాడి ♦ యరులకోడి
కన్నులారఁగజూచునే ♦ కరుణమాలి.

అభయ—(ఆలకించి) ఎవరిదియాకంఠధ్వని? నాఁడు సేనరణ్యమునందుఁ జూచిన గౌతమరాజామాత్యుండైన దుర్గదాసుని కంఠధ్వనిఁబోలియున్నది. మిత్త్రిమా! ఆల కింపుము.

విదూష—(నిరసనగా) దుర్గదాసో భర్గదాసో నాకు తెలియదు. ఎవరైనను మనకేమి? అభ్రిష్టుల యఱపులువిని లేనిపోని సంగతులయందీవనవసరసంబంధంబుఁ గలుగఁ జేసికొనకుము.

దుర్గదా—(ప్రివేశించి సవిచారముగా) హా! భరతమాతా! లోకైకపూతా!

ఉ. ఆలమునందు వెన్నునెపు ♦ డైన నొసంగనిరాజపుత్త్రిలుం
గాలునినైనఁ దోలఁగల ♦ ఖండితవైరిబలాఢ్యులైన పాం
చాలురు నుగ్రితేజులగు ♦ సాళ్వులు వీరులుసింధుభూప్రిజల్
నాలుగుదిక్కులందు నిను ♦ నమ్మిభజింపఁ బఠానుఁ గొట్టెనే?

విదూష—పాపమీవిచారమునకుఁ దరిలేదు. ఈజోగికి మోకాలఁటిలో మెడ నరము పట్టినది.

అభయ—(వారించి) ఓయీ! పేర్లిలరీ! సంగరరంగభంగరిపుమత్త మతంగశిరోరు కుంభవిభ్రాజిత శుభ్రిముక్తికమణిగణోజ్జ్వల మండనుండగు నృసింహుండీయతిని రేణ్యుం డని యెఱుంగుము. వీనికడ నీయసంబద్ధప్రిలాపంబులు సాగిరావు. ఇఁక నీహాస్య ప్రిసంగములఁ గట్టిపెట్టుము.

విదూష—అవును వీని ముఖముఁ జూడకయే చెప్పుచున్నది. ముంజేతికడికడి యమున కద్దమేల? ఈదీర్ఘ సమాసములచే నీవు వేలుగఁ బొగడనవసరము లేదు.

దుర్గదా—(సహర్షముగా) కుమారా! జయము. జయము.

అభయ—(లేచియెదురేగి లేనగవుతో) అర్గళపురేశ్వరామాత్యశేఖరునకభివాదనము.

దుర్గదా—ఆయుష్మంతుఁడా! అమ్మహేశ్వరకృపాకటాక్షవీక్షణమాలికాలంకృతుండవగుటంజేసి నీకు కల్యాణమగుఁగాక!

అభయ—ఆర్యా! మీరీపీఠమలంకరింపుఁడు.

దుర్గదా—వత్సా! నీవును సింహాసనాసీనుఁడవు కమ్ము.

(ఇరువురుఁగూర్చుందురంత)

అభయ—

చ. కుశలమె యర్గళేశున క ♦ కుంఠితపూతచరిత్రి దేవికిన్?
కుశలమె నీరజాక్షి సుమ ♦ కోమలి హేమలతాలతాంగికిన్?
కుశలమె మీకు బంధులకు ♦ కుంభినినాథుని సేవకాళికిన్.
విశదముఁ జేయుమయ్య విన ♦ వేడుకలూరెఁడు నామనంబునన్

దుర్గదా—నేఁబయనమగునప్పటి కందఱుఁ గుశలులుగనే యుండిరి.

అభయ—మీరచ్చోటు విడిచి యెంతకాలమైనది.

దుర్గదా—నేఁటికి పది నెలలైనది.

అభయ—ఇంతకాల మెందునివసించితిరి?

దుర్గదా—ఒక్కచోటననేల. ఆవింధ్యాశీతనగపర్యంతంబునంగల దేశమంతయుఁ దిరిగితిని.

అభయ—(సవినయముగా) ఆర్యా! ప్రస్తావన ననుసరించి యడుగవలసివచ్చినది. కనుక నన్ను మన్నించి నాశంకఁ దీర్పఁగోరెదను.

దుర్గదా—(సహర్షముగా) కుమారా! నీయవశ్య మడుగవచ్చును.

అభయ—

ఉ. పాణిఁగృపాణిఁబట్టి రిపు ♦ వర్గముఁ గొలుని వోలెఁ గూల్చి వి
న్నాణముఁ బుట్టుమాహలీశునకు ♦ నర్మిలిఁ బల్కెడి మీరు దండముం
బాణిని బూనియిట్లు యతి ♦ వర్యులరై చరియింపనేలొకో
రాణఁదనర్చు మీదు మృదు ♦ రమ్యశరీరముఁ గష్టపెట్టుచున్.

దుర్గదా—(చిఱునగవుతో) ఇదియా! నీవు పొందినశంక. అడిగితివి కనుకఁ జెప్పెదను వినుము.

ఉ. భారతవర్షమను వనము ♦ పాపపతానుదవాగ్నిచేఁ గటా!
ఘోరముగా దహింపఁబడి ♦ కూలుచునున్న దిదానినిప్పుడీ
ధారుణిఁగానవెంచి యతి ♦ ధర్మమునొంది తపంబుబూనితిన్
వారకరాజశేఖరుకృ ♦ పంగనుఁ దిగ్విజయంబుఁ గాంచనై.

వెండియును

సీ. సన్యాసులేకదా ♦ జనపతిఁ జేసిరీ
క్షితికిజగద్బంధు ♦ కులునినాఁడు
యతివరేణ్యులేకదా ♦ యఖిలధర్మంబుల
నేర్పడఁ దెలిపిరి ♦ యెల్లలనునాఁడు
తాపసులేకదా ♦ భూపులమిమఁ జేసి
వైరులఁ గూల్చిరి ♦ పరిభూతనాఁడు
మునినాథులేకదా ♦ జనులకష్టసుఖము
లరసిపాలించిరి ♦ యనఘనాఁడు

తే. గీ. ధరఁబరిమాజకులేకదా ♦ భరితఖండ
మునకు వలసిన యుపకృతుల్ ♦ మున్నొనర్చి
రమ్మహాత్ములు చేయని ♦ యట్టిమేలు
దేశమునకెద్ది కలదు పృ ♦ థ్వీశ! చెపుమ?

కనుక నట్టివారలాచరించిన యాచారమునే నేను నాచరించుచుంటిని.

అభయ—ఆచార్యా! మీరేయే క్షేత్రంబుల కేగితిరి? అందుంగల విశేషంబులెయ్యవి?

దుర్గదా—నరనాథా! తిరుగవలసిన దివ్యక్షేత్రములన్నియుఁ దిరిగితిని. ఆయాస్థలంబుల నుతాసలొనర్చిన దుండగములనంతములు.

నికి వాడు రేపురాత్రికి వచ్చునట్లు చేయుదును. మన రహస్యము బయలుపడకుండ నిటు నుండి తొందరగా నవ్వలికరిగి నీస్థానమునకు పొమ్ము. అని చెప్పి యామెను పంపి వేసెను.

సింహబలుడు ద్రౌపదిని మోహించి యున్నవాడగుటచే నాటిరాత్రి నిద్దురపట్టక వేదనపడుచు నామె యెట్లు తనకు స్వాధీనమగునాయని యాలోచించుచు తెల్లవార్చెను. మరునాడు ప్రొద్దుపొడుచునప్పటికే శృంగారించుకొని మరల తన యక్కయైన సుదేష్ణ మేడకరిగెను. అక్కడ మరల సైరంధ్రి తనకంట బడగానే మోహము రెట్టించి యామెతో సంభాషించు నందాక నిలువలేక పోయెను. ఏది యెట్లయినను నాసుందరితో పొందు చేయవలయునని నిశ్చయించుకొన్న యామందుడేదియో వంక పెట్టి యచ్చట నీవలావలనెందరున్నను వెరవక సమీపించి యామెను పలుకరించి తన మనోరథ మెట్టిదయిన దీర్పుమని వేడుకొనెను. ద్రౌపది యతని వేడుకోలునకు మెత్తపడిన దానివలె నటించి వానింజూచి యదరక బెదరక యిట్లనియెను.

కీచకా! నీవంటి పట్టుదల గలవాని నేనెందును చూచి యెఱుంగను. నీదీనతకు నాకెంతయు జాలి యగుచున్నది. నీవు నామీది మోహముచే పరితాప పడుచు స్వస్థచిత్తత లేకున్నట్లు వినియున్నదానను. నీదిక్కము నెఱుంగుటకునై యింతయాలసించితిని. ఇంక నీవిషయమున నుపేక్షించినచో నాకు పాపము సహాసంభవించును. నీవు నేటిరాత్రి యేకాంతముగా నృత్తర విద్య నేర్చుకొనుచున్న నాట్యశాలకు రమ్ము. నే నచ్చటికి వచ్చి నిన్ను స్వస్థునిచేసెదను. ఇక నిక్కడినుండి వేగమే పొమ్ము. మన సంభాషణము నెవ్వరైన విన్న ననుమానింతురు. ఈసంగతి నీమిత్రులకయినను చెప్పగూడదు సుమీ! యని వానిని నమ్మించి సంతోషపరచి పంపివేసెను.

సైరంధ్రి నోటివెంట నటువంటిమాటలు వచ్చుటతోడనే సింహబలునకు పట్టరాని సంతోషము వచ్చెను. అతడప్పుడు స్వర్గమునందున్నవానివలె నానందించెను. అచ్చట నిక నిలిచెనేని నామెకేమి కోపము వచ్చునోయని సెలవు పుచ్చుకొని వెంటనే మెల్లన నీవలకు వచ్చెను. కాని యంతకు క్రితమురోజున నట్లు దూషించి వశముగాని యాసుందరి నాడు సులభముగా వశమగుటకేమి హేతువో యని సంశయించెను. తన సౌందర్యము మాట యటుండ తన బలమును బుద్ధిని సంపదను నితరులవలన విని తిన్నవలచి యుండుననని తలంచెను. సైరంధ్రికి గంధర్వు లయినను పతులున్నవానియు

వారు బలవంతులును మాయావంతులును నగుటచే వారివల్ల కీడు గలుగును గాన నామె జోలికి పోవలదని సుదేష్ణ తనకు బోధించుట జ్ఞాపకము రాగా నీమె యీమిషచే గంధర్వులచేతతన్ను జంపించుట కక్కడకు రమ్మని యుండదు గదాయని యనుమానము గలిగెను. తాను సింహబలుండగుటచేతను నందరును తానన్న వెరచుచుండుటచేతను తన్నెదిరించిన వారదివరకెవ్వరును లేకుండుటచేతను గంధర్వులను గాని గింధర్వులను గాని సింహబలుండగు నీకీచకుడు లెక్కసేయునాయని గర్వించి యెట్లయిన నచ్చటకు పోవుటకే నిశ్చయించుకొనెను. బుద్ధికర్మ ననుసరించును గదా!

ఆరాత్రి ద్రౌపదియు భీముడును కలుసుకొని నాట్యశాలయందు ముందే ప్రవేశించి యుండిరి. భీముడొక తల్పమున ముసుగు వెట్టుకొని పరుండి యుండెను. దీపము దీసివేసి ద్రౌపదియొక మూలనొదిగి యుండెను. కీచకుడు సింహమున్న గుహలోనికి పోవు జంబుకమువలె నచ్చటికి వచ్చెను. సైరంధ్రి యెవ్వరికిని తమ సంగతి తెలియకుండుటకై దీపమునార్పివేసెననుకొనియెను. మెల్లగా లోనికి ప్రవేశించి తడవుకొనుచు సైరంధ్రీ! ప్రాణేశ్వరీ! వచ్చితివా! యెచ్చటనుంటివని పిలిచెను. సైరంధ్రి పలుకలేదు. భీముడును పలుకలేదు. కీచకుడు తల్పము దగ్గరకుపోయి చూచి సైరంధ్రి తనకన్న చాలముందుగ వచ్చి నిద్రపోవుచున్నదని యూహించి చెయివేసి తట్టుచు మెల్లగా లేపెను. భీముడు నిద్రపోవువాడు మెలకువగను నట్లెట్టునటు పొరలెను. సైరంధ్రి లేచినదని యెఱింగి యామె సౌందర్యమును పొగడుచు కొన్ని పలుకులు కీచకుడు పలికెను.

ఆమాటలకు భీముడు ప్రత్యుత్తరము స్త్రీకంఠముతో మెల్లగా నిట్లు చెప్పెను. ఓకీటశేఖరా! నీవు చీకటి యగుటచే తిన్నగా తెలియలేక నాయందమును సరిగా వర్ణింప లేక ఘనతకు లోపము తెచ్చుచున్నావు. నన్నీలోకములోని స్త్రీలోకములో నెవ్వరితోను పోల్చవలదు. నాలావణ్య మనన్య సామాన్యము. నాతోడగలసితివేని నీవిక నీజన్మమున నే యితరస్త్రీల సంగతిని బోజాలవు. నీపుణ్యమునకు తగిన ఫలము లభించినదే యనుభవింపుము. అని పలుకుచు గ్రక్కున లేచి గట్టిగ పిడికిలితో నొక పోటు పొడిచెను.

ఆపోటు దిని సైరంధ్రి వంచించినదనియు వాడెవ్వడో గంధర్వుడనియు నెంచుకొని రోషించి శక్తికొలంది భీమునొక పోటు పొడిచెను. అంత వారిరువురును ద్వంద్వయుద్ధమునకు దొరకొనిరి. ఆరణమున భీముడు కీచకుని పీచమడచి యతని శరీరమెల్ల

మణిచి ముద్దగా చేసెను. తన్ను పరాభవించిన దుర్మార్గశిరోమణి యగు కీచకుని చంపిన నాథుని ద్రౌపది సంతోషముతో గ్రుచ్చి కౌగలించుకొనెను. భీమసేనుని బలమును ప్రతిన నెరవేర్చుకొనుటను మెచ్చుకొనెను. పిదప నెవరిస్థలములకు వారలరిగిరి.

తెల్లవారిన వెనుక సింహబలుడు కన్పింపకుండుటచే నతని మందిరమున నల్లకల్లోలము జనించెను. అదివరకు దినమున సైరంధ్రిని వలచి యుండి యవమానమును నామెను వెంబడించి యుండుటచేతను నుదయమున నతని జాడ లేకుండుటచేతను గంధర్వులత పట్టి బంధించి యేమైన చేసినారేమో యను భయమంతఃపురమున బుట్టుటయే యీకల్లోలమునకు కారణము. ఈవార్త క్రమముగా సుధేష్ణదేవికి తెలిసెను. ఆమె భర్తయొద్ద కేగి విలపింపసాగెను. విరాటుడెల్ల యెడల సేవకులుచే వెదకించెను. చివరకు సింహబలుని శవము ముద్దయై నాట్యశాలలో నున్నట్లు తెలియవచ్చెను. ఆవిత్రసధను చేసినవారు తప్పక గంధర్వులే యగుదురనియు మనుష్యమాత్రులెవ్వరును నంతటి బలవంతుని నాయుధసహాయములేక సంహరింపజాలరనియు నెల్లరును నిశ్చయించిరి. పరస్త్రీల నపేక్షించిన వారికెన్నటికైన భంగమున్నదేయని కొందరనుకొనిరి. పతివ్రతలపాట్లు తప్పెనికనని కొందరు సంతసించిరి. వాని దుర్మరణమునకై సుధేష్ణ మొదలగు బంధువులును మిత్రులును దుఃఖించిరి. తనకు సహాయుడై కాపుదలగా నున్నవాడు చనిపోవుటకై విరాటుడును విచారించెను.

కీచకునికి తమ్ములనేకులు గలరు. వారందరును దుఃఖించి యాకళేబరమును సంస్కారము చేయుటకై కొనిపోవుచుండిరి. ఆసమయమున పురజనులనేకులు చూచుటకై వచ్చియుండిరి. వారిలో ద్రౌపదియు నుండెను. కీచకుని తమ్ములకుపకీచకులని పేరు, ఆనీచునితమ్ము లుపనీచులు గాకుందురా! వారును నంతటిబలవంతులు గాకున్న మానెగాని దుర్మార్గులు గాకపోలేదు. సైరంధ్రి యకస్మాత్తుగా మందిలోనుండి వారికంటబడెను. తన యన్నమృతికి కారకురాలైన యాకాంతను కూడ పట్టి కట్టి వానితో సహగమనము చేయించినయెడల వాని యాత్మ సంతసించునని తలంచి యారాక్షసులు సైరంధ్రినిపట్టి బలవంతమున గట్టి ప్రేతభూమి కీడ్చుకొనిపోవుచుండిరి. అయ్యో! పాపము! ద్రౌపదికి సంభవించిన యాపద లోకదానికన్న నొకటె మిగుల ఘోరమును దుస్సహమును నై హృదయము బ్రద్దలుచేయుచున్నవి గదా! అనుగుణవతి యిట్టికష్టములెల్ల నెట్లుభరింపగలిగెనో? హా! ఈశ్వరా!

అప్పుడు తనకు సంభవించిన యాపదను తొలగించి రక్షించు దిక్కులేక సైరంధ్రి హాహాకారము చేయుచు బిగ్గరగా రోదనము సేయదొడంగెను. దగ్గరనుండి చూచుచున్న వారి హృదయములును నిక్కాగారి హృదయములు నీరై భయాక్రాంతము లయ్యెను. తన మాటలక్ష్యము సేయరని యెఱింగియు గంధర్వులేవచ్చి తన్నీ యాపదనుండి యీ యబల నుద్ధరింపగలరనియు తలంచి విరాటుడును కీచకులనేమియు ననక యూరకుండెను. మహారాజే యనన్యుడైనయెడల నిక ప్రజలెవ్వరేమి చేయగలరు?

కీచకులు శ్మశానమునకు గొనిపోయి కీచకుని శవమును సైరంధ్రిని చితిమీదనుంచి యగ్ని నంటించుచుండిరి. కూడవచ్చిన పౌరులా ఘోరమును చూడలేక మొగములమీద గుడ్డలు వైచుకొనిరి. సుశీలయగు సైరంధ్రి నిష్కారణముగా నగ్నిహోత్రుని కాహుతి యైనదనియే వారందరు తలంచి వగచిరి. ఆసమయమున భయంకరాకారుడగు పురుషుడొకడు వాయువేగమున వచ్చి యుపకీచకుల నెల్లరిని పీడగించి సైరంధ్రి బంధనంబుల విడిపించి యదృశ్యుడయ్యెను. అందరు నాశ్చర్యము నొందిరి. ఆవచ్చినవాడు గంధర్వుడేయని యందరు ననుకొనిరి గాని యతండు సింహబలుని సంహరించిన మహాబలశాలియగు భీమసేనుడే.

ఉపకీచకులుకూడ వధింపబడినది మొదలు విరటునిపురములోని జనులెల్ల సైరంధ్రి యెడల మిగుల భయభక్తులతో మెలగుచుండిరి. ఆమె నెవ్వరేమనినను పురుషులెవ్వరైన నామెను కన్నెత్తి చూచినను గంధర్వులువచ్చి చంపి పోవుదురను భయమున నెల్లరు గడగడలాడుచు నామెను దేవతవలె భావించుచుండిరి. సుదేష్ణయును నామె పేరు వినినంత గడగడ వడంకుచుండెను. ఉపకీచకులు మడిసినతరువాత సైరంధ్రి తనదగ్గరకు వచ్చినతోడనే యామెతో సుదేష్ణ యిట్లనియెను. కాంతామణీ! పురుషులు సామాన్యముగా చపలచిత్తులు. నీవు మిగుల సౌందర్యవంతురాలవు. నీమూలమున నింకనెవ్వరికేమి కీడుమూడునో యని వెరచుచున్నదానను. నాపతియును నీవలన తనకేమి యాపదగలుగునో యని భయపడుచున్నవాడు. నీవిక నీయిష్టమువచ్చినచోటికి పొమ్ము. అని చెప్పెను.

ఆమాటలు విని సైరంధ్రి యామెకిట్లనియె. అమ్మా నేనొకవత్సరము మాత్రమే నీయొద్దనుండదలచి వచ్చితినని చెప్పియేయుంటిని. నేను వచ్చి మూడుదినములు తక్కువగా సంవత్సరమైనది. ఈమూడురోజులుమాత్రము నీనగరున నుండనిమ్ము. పిమ్మట నొకనిమిషమైన నిచ్చట నుండక నాయిచ్చవచ్చిన తావునకేగెదను. అని వేడుకొనెను.

సుధేష్ణ మంచిదని యందుల కంగీకరించెను. అమూడుదినములును సుధేష్ణ యామెచేత సేవలేమియు చేయించుకొనక తానే యామెకు సేవసేయుచు భయవినయములతో ప్రవర్తించెను.

పాండవు లజ్ఞాతవాసమున కరిగినది మొదలు దుర్యోధనుడు వారిని వెదకించి పట్టుకొని మరల వనవాసమునకును నజ్ఞాతవాసమునకును పంపివేసి రాజ్యమునంతను తామే నిరంకుశంబుగా యధేచ్ఛముగా పరిపాలింపవలయునని తలంచి నిపుణులగు సేవకులను చారులను నానాదేశములకు పంపించి పాండవులజాడ తెలిపినవారికి చాల బహుమతులిచ్చెదమని చాటింపించెను. ఎన్నిప్రయత్నములు చేసినను పాండవులజాడ కొంచెమియు తెలియదయ్యెను. పాండవులు బ్రదికియుండినదియు లేనిదియు కూడ నెవ్వరు నెఱుంగరు. విరటుడునయితము ధర్మరాజాదులు సాధువులగుటచేతను ముఖ్యముగా బంధువులగుటచేతను వారెచ్చటనున్న సంగతియు నెఱుంగక వారు రాజ్యభ్రష్టులయినందులకును వనవాసులయినందులకును ప్రస్తుతమెందున్నదియు నేమేమికష్టములు పడుచున్నదియు తెలియనందులకును మిగుల వగచుచుండెను. సుధేష్ణయు సుకుమారియగు ద్రౌపది కష్టదశను తలంచి చింతిల్లుచుండెను.

ఇట్లుండగా నొకనాడు దుర్యోధనుని సభలోని కొకవార్త వినవచ్చెను. విరటుని బావమరదియగు సింహబలుండొక గంధర్వునివలన చిత్రవధ గావింపబడినట్లును తరువాత నుపకీచకులు కూడ చంపబడినట్లును వినవచ్చెను. ఆకాలమున భీముడు దుర్యోధనుడు జరాసంధుడు సింహబలుడు హిడింబాసురుడును మహాబలవంతులని ప్రఖ్యాతి జెందియుండిరి. వారిలో జరాసంధుడును హిడింబాసురుడును నదివరకే భీమునిచేత సంహరింపబడుట జగద్విదితమయ్యెను. తక్కిన ముగ్గురిలోను సింహబలుడిప్పుడు చంపబడినవాడు. దుర్యోధనుడు తానుపోయి చంపలేదనుట స్పష్టము. ఇక భీముడొక్కడే వానిని చంపియుండవలయును. గాని పరులెవ్వరును చంపజాలరు. కావున తప్పక భీమసేనుడే కీచకుని సంహరించియుండవలయు నని సుయోధనుడు నిశ్చయించుకొనెను. మఱియు విరాటునిపురమున సంవత్సరమునకు పూర్వమునుండి వచ్చియున్న క్రొత్తమనుష్యులారుగురు కలరనియు వారిలో పురుషులయిదుగురనియు వారు పంచపాండవులను పోలియున్నారనియు వారివయస్సే వీరికిని గలదనియు స్త్రీకూడ తప్పక సర్వవిధములను ద్రౌపదిని

బోలియున్నదనియు చారులు చెప్పిరి. అందువల్ల నందరును వారు తప్పక పాండవులును ద్రౌపదియు నై యుందురని నిశ్చయించి చెప్పిరి.

అయినను ననుమానము తీరునట్లొక యుపాయము దుర్యోధనుడు పన్నెను. మిగుల బలవంతులైన మల్లులను కొందరిని విరటుని పురమునకు పంపించి మల్లయుద్ధము చేయువా రెవరైన నీరాజ్యమునందున్నయెడల పందెమునకు రమ్మని పిలువుమని పంపించెను. వారట్లు పోయి తమవచ్చినకార్యము తెల్పిరి. ఆమల్లులదివరకు చాల ప్రసిద్ధికెక్కినవారగుటచేతను వారితో సమానముగా పట్లుపట్టగల బలవంతులు తనరాజ్యమునందు లేకుండుటచేతను తనకవమానము వచ్చినదని విరాటుడు విచారించుచుండెను. కాని యది కంకుభట్టురూపమున నచ్చటనున్న ధర్మరాజు రాజుహృదయమును తెలిసికొని వలలాంకుని బలము సంగతి నెఱుంగ జెప్పి యతనిని పిలిపించి వారితో యుద్ధముచేయించి వారి నోడించి పంపించి విరాటుని గౌరవము నిల్పెను.

ఆ జెట్టివాండ్రు విరాటునిపురమున పరాభవము నొంది తిరిగి వచ్చి యతడు తప్పక భీముడే యనియు పాండవులు తప్పక విరటునిపురమున నున్నవారనియు నమ్మించి చెప్పెను. తాముపంపిన మల్లులతో సమముగా పోరువారు విరాటునిపురమున లేరని యిదివరకే తానెఱింగియున్నవాడగుటచే నెవరును వారిని జయింపలేరనియు భీముడాపురమున నున్నయెడల మానక వారితోడ పోరాడుననియు పోరాడి జయించినయెడల నానవాలు పట్టవచ్చుననియు పాండవు లచ్చటనున్నట్టు తెలిసినవెనుక గొప్పసైన్యముతో తాను దండెత్తిపోయి విరాటుని పశువులను పట్టుకొన్నయెడల పాండవులు విరాటునికి సహాయులై యతనితో గలసి యుద్ధమునకు వత్తురనియు నట్లు వచ్చిరేని వారిని గుర్తుపట్టి మరల కడగండ్ల పెట్టవచ్చుననియు నీపన్నుగడ దుర్యోధనుడు పన్నెను.

దుర్యోధనుని యూహాప్రకారమంతయు జరిగెను గాని యుద్ధమునాటి కజ్ఞాతవాసదినములు గడచి విఫలమనోరథుడై సుయోధనుడు విచారింపవలసివచ్చెను. జంఝామారుతమునకు మేఘవ్రాతమునవలె ద్రౌపదీదేవి కష్టములు గడచిపోయి సౌఖ్యకాలము వచ్చెను. విరాటుడును సుదేష్ణయు తమకొలువులోనే పాండవులున్నవారని తెలిసికొని వారినెంతో గౌరవించుచు నదివరకు వారిచే పరిచర్యలు గొనినందులకు క్షమింప బ్రార్థించిరి. తమపుత్రికయగు నుత్తర నర్జున పుత్రుడగు నభిమన్యునకు పెండ్లిచేసిరి.

అనంతరమున పాండవులు తమయింద్రప్రస్థపురంబున కరిగి నిర్ణయముప్రకారము పండ్రెండేండ్లరణ్యవాసమును నొకయేడజ్ఞాతవాసమును గడపి వచ్చితి మిక మా రాజ్యమును మాకు వదలివేయుమని యడిగిరి. కాని యెట్లయినను పాండవుల దాయభాగముకూడ నపహరించి తానే యేలవలయునని నిశ్చయించుకొనినవాఁడు కావునను ధర్మమునకు కట్టుపడని యవినీతిపరుఁడు కావునను పాండవులకు సూదిమొన మోపినంత నేలయైనను నీయనని నుడివెను. చివరకు ధర్మరాజు యుద్ధముచేయుట కిష్టములేక కైదుగురకి నైదూళ్ళిచ్చినను చాలునని యడిగెను. అందునకును కౌరవులొప్పుకొనలేదు. యుద్ధమనేకానర్థములకు మూలమనియు దానివలన బంధునాశనమును ధననష్టమును ప్రజానష్టమును గలిగి దేశమునకు తీరని నష్టము సంభవించుననియు దూరదృష్టిగల యోచించి శ్రీకృష్ణుడెట్లయిన నిరువురికిని సంధిచేయవలయునని పాటుపడెను; కాని యదియేమియు నెరవేరదయ్యెను.

కౌరవులు వివేకవిహీనులును దుష్టస్వభావులును స్వార్థపరులును నగుట ప్రథమకారణము. ఒక్క ధర్మరాజునకు తక్క తక్కినపాండవుల కెవ్వరికిని కౌరవులతోడి స్నేహమున కిష్టములేకుండుట రెండవకారణము. తన్నదివరకు పెట్టిన బాధలకును చేసిన యవమానమునకును తగిన ప్రతీకారముచేసి దుశ్శాసన దుర్యోధనాదుల గర్వభంగము చేసి తనకు సంతోషము గూర్చుటకైన రణమొనరింపవలసినదని ద్రౌపది పట్టుపట్టుట మూడవకారణము. భీమసేనుని ప్రతిజ్ఞలు నాలవకారణము. ఇట్లింకను నెన్నియో కారణములు కలవు. ఈకారణము లన్నియు కౌరవులతో పాండవులను యుద్ధముచేయుడని ప్రేరేపించుటకు ముఖ్యకారణము లయ్యెను. ఇరుపక్షములవారును యుద్ధమునకు సిద్ధమైరి. కృష్ణుడు, సాత్యకి, విరటుడు, ద్రుపదుడు మొదలగు రాజులు పాండవులపక్షమున వచ్చిరి. తక్కినరాజులందరును కౌరవులపక్షమున పోరవచ్చిరి. కౌరవులకు ద్రోణుడును పాండవులకు దృష్టద్యుమ్నుడును సైన్యాధిపత్యములను వహించిరి.

పాండవుల సైన్యమంతయు నేడక్షౌహిణులుండెను. కౌరవులసైన్యము పదునొకండక్షౌహిణులుండెను. ఉభయసేనలయందును మహాబలవంతు లధికముగా నుండిరి. రెండుతెగలవారికిని యుద్ధము జరుగవలయుననియే యుత్సాహముగా నుండెను. కావున యుద్ధమారంభమయ్యెను. ఆయుద్ధము కురుక్షేత్రమున జరిగెను. అది పదునెనిమిదిదినములు జరిగెను. యుద్ధము జరిగినకాలము కొంచెమే యైనను నతిఘోరయుద్ధము జరిగెను.

అట్టియుద్ధము భరతఖండమున నిదివరకెన్నడును జరిగియుండలేదు. ఆరణమువలన మనదేశమునకు సంభవించిన నష్టమింతయంత యని చెప్ప నలవి కాదు. మొత్తముమీద దినము నకొక యక్షౌహిణి చొప్పున పదునెనిమిది దినములకును పదునెనిమిది యక్షౌహిణులు మరణించిరి. వారిలో ననేకులు మహావీరులు, మహాయోధులు, మహాబలులు, మహామంత్రులు, మహారాజులు నుండిరి. ఆయుద్ధమునశూరులగు బాలురును శూరపత్నులైన స్త్రీలు నయితము సంహరింపబడిరి. మహాగజములు, నశ్వములు, నుష్ట్రములు, మొదలగు జంతుగణము విస్తారముగా వధింపబడెను. ఆయుద్ధమువలన గలిగిన నష్టమువలన నెల్లవిధముల క్షీణించిన మనదేశమింకను కోలుకొనలేదని చెప్పిన నెంత యనర్థకమాయుద్ధమువలన సంభవించినదో తెలియగలదు.

దుర్యోధనుడు సోదరబంధుమిత్రపరివార సమేతముగా నశించెను. భీష్మాదిమహాయోధులును మృతిజెందిరి. పాండవులపక్షమున పంచపాండవులును ద్రౌపదీపుత్రులును కృష్ణుడును సాత్యకియు దృష్టద్యుమ్నుడును మాత్రము మిగిలిరి. కౌరవపక్షమున నశ్వత్థామ మిగిలెను. అంతటి సంపదయు వైభవమును గలిగియు దిక్కులేక మరణించుచున్న దుర్యోధనచక్రవర్తిని చూచి మనసు కరగి యాదెవరదాక తన్నుపోషించి గౌరవించుచుండిన యతనికి మేలుచేసి సంతసము కూర్పనెంచి మహాపాతకమతిఘోరమైన తలపక యపకీర్తికి వెరవక యర్ధరాత్రమున నేగి నిద్రించుచున్న ద్రౌపదీపుత్రులను దృష్టద్యుమ్నుని నణికి ఘోరముగా వధించెను.

పుత్రులందరు నొక్కమారుగా మరణించుటకు ద్రౌపది మితిలేనిదుఃఖము నొందెను. అప్పుడర్జునుడు వచ్చి ద్రౌపది నోదార్చి కాంతా? చింతింపకుము. నిర్దయుడై నిద్రితులగు పసిబాలురను గొంతుకోసిచంపిన యాబ్రాహ్మణకిరాతకు నిప్పుడే వధించుటకై పోవుచున్నాను. ఆవిప్రచండాలుని శిరమును పాదమున దన్ని స్నానము చేయుదువుగాని యని చెప్పి వానిని వెంబడించెను. అశ్వత్థామ పారిపోయెను. పరాజితుడై యాజి విడిచిపోవువానిని చంపరాదని కృష్ణుడర్జునితో చెప్పెను. అర్జునుడశ్వత్థామను బంధించి ద్రౌపది దగ్గఱకు కొనివచ్చెను.

సీ. అధికారితనపరీక్ష లాదరించనిపట్ల
మారుపరీక్షలవేసి మరలవలయు
పనిచేతగానట్టి ప్రభువువచ్చినపట్ల
తప్పుతోవలబెట్టి దాటవలయు
ప్రశ్నప్రశ్నకు చుట్టు, ప్రక్కలజూచుచు
సాక్షులతనిఖీలు సలుపవలయు
ప్రతివాదివాదంబు ప్రభువులువినకుండ
గందరగోళముజేయ గడగవలయు.

గీ. కేసు గెలుపెంత? యోటెంత? కేసులెన్నొ
వేసి ప్లీడరు వాదించె వింతగా న
టంచు పార్టీలు తలపోయునట్లుచేసి
వారి బంపవలయున్యాయ వాదియెపుడు.

సీతా—అన్నిటికంటె యీయుపదేశము శ్లాఘాపాత్రముగనున్నది.

నీల—పంతులుగారు! ఇంకనేమైన విశేషాంశములున్నవా?

రంగ—అబ్బో! చాలాఉన్నాయి! చెప్పుటకు వీలులేదు; చేయించవలయును. మీనాయనగారితో మాట్లాడినాను. నాతో జాయింటుగాపని చేస్తూఉండిన అన్నిధర్మములు తెలియగలవు. సారాంశములు చెప్పెద వినుము.

1 ప్లీడరు పరుల నమ్మించవలెనుగాని నమ్మకూడదు.

2 ప్లీడరు కార్యవాదిగావలయునుగాని ఖడ్గవాదికాగూడదు.

3 ప్లీడరుకు డబ్బేప్రధానముగాని తక్కినవానితో పనిలేదు.

4 ప్లీడరుకు పాపపుణ్యములు పనికిరావు.

5 ప్లీడరుకు దూషణభాషణతిరస్కారములు సమానములు.

6 ప్లీడరుసర్వసముడు, విధినిషేధములులేవు.

7 ప్లీడరు సర్వభక్షకుడు.

8 ప్లీడరు సగుణుడు, నిర్గుణుడు, గుణాతీతుడు.

9 ప్లీడరు 'ధనం సత్యం' "జగన్మిథ్య" యని వాదముచేయవలెను.

10 ప్లీడరుకు "ఆత్మస్తుతి' 'పరనింద' నిత్యాధ్యయనముగా నుండవలెను.

ఈపదియుపదేశములు (టెన్ కమేండుమేంట్సు) గమనించి పనిచేయువాడు, సర్వదుఃఖములబాసి శాశ్వతైశ్వర్యములను బడయును.

సీతా—రంగయ్యపంతులువారు నేటిదినమున యపరవ్యాసులవారివలెను, ఆదిసంకరులవలెను, యభినవరామానుజ మతప్రవర్తకులవలెను, ప్రబలశాక్తేయులవలెను, రెండవచార్వాక, బుద్ధప్రబుద్ధులవలెను నుపన్యసించినారు.

రంగ—సీతారామశర్మగారెప్పుడును వికటకవులే. ఆయనకు 'పెసిమిస్టిక్' యూహాలేగాని కార్యవాదము చేతకాదు. అందుచేత నన్నిట్లధిక్షేపిస్తారు, ఈయనకు నాకునుగల తారతమ్యమందరికిని తెల్లమే; నీలకంఠంగారు కేపుకోర్టులో ఒకచమత్కారమైన కేజు విచారణకాగలదు. నాతమాషాఅంతా అప్పుడు చూపిస్తాను. ప్రొద్దుపోయినది సభచాలింతము.

(అందరు నిష్క్రమింతురు.)

# న్యాయవాదివిలాసము.

## పంచమగుచ్ఛము. పార్టు. 1

### రంగము—కోర్టుమందిరము.

[న్యాయాధిపతియును గుమాస్తాయున్ను కొందరు ప్లీడరుగుమాస్తాలున్ను ప్రవేశించుచున్నారు.]

న్యాయ—ఏమయ్యా గుమాస్తాగారు! త్వరగా వారంటుగ్రంథము తీసికొనిరండు.

గు—చిత్తము (అనిరికార్డుతో ప్రవేశించుచున్నాడు;)

న్యాయా—సరే కేజులుపిలు.

గు—చిత్తము! నేటిదినము ప్లీడర్లువరున్ను యింకారాలేదు. టైముకూడాకాలేదు.

న్యాయా—టాట్, నాన్సెన్సు! కోర్టువారు ప్లీడర్సుకోసము వెయిట్ చేయవలెనా? ప్లీడర్లు కోర్టువారికోసము వెయిట్ చేయవలెనా? టైము అయినదో లేదో నీకు తెల్సును? కోర్టుగడియారము తప్పు. అదిగో ఆగడియారము స్లోగానున్నది. సవరించుము. నావాచిలో 11 గంటలైనది.

గు—చిత్తము! అదిసరిగానేయున్నదండి నేను పోస్టాఫీసులోని గడియారముతో నావాచి సవరించుకొనివచ్చినాను. నా విన్న కోర్టులోని గడియారమున్ను సరిగానేయున్నవి గనుక సవరణ అవసరములేదు.

న్యాయా—టాట్, అధికప్రసంగము చేయకు. [illegible] కి రానిగుమాస్తాలకందరికి లేటుమార్కు చేయుమని చెప్పవోయి బంట్రోతు.

బంట్రో—చిత్తము (అటుచూచి) హెడ్డుగుమాస్తాగారు యింకా రాలేదండి.

న్యా—ఆ! ఆలాగునా? అట్టెండెన్సుబుక్కు తీసుకొనిరా!

బంట్రో—చిత్తము. (అని బుక్కు తెచ్చి యిచ్చుచున్నాడు )

న్యాయా—(బుక్కులో సంతకముచేసి) ఇది హెడ్డుగుమాస్తా బల్లమీద ఉంచుము.

బంట్రో—చిత్తము (అట్లుచేయుచున్నాడు.)

న్యాయా—ఊఁ. పిలువుము. పార్టీలను పిలువుము.

గు—వట్టికూటి గంగయ్య, అనిపిలువుము.

బంట్రో—వట్టికూటి గంగయ్యా! (3 అని కేకవేసి
హాజరులేడండి యనుచున్నాడు.)

న్యాయా—పిటీషను డిస్ మిస్డు

గు—కూరపాటి గరిటెయ్య (3 అని కేకవేసి హాజరుకాలేదండి అనుచున్నాడు.)

న్యా—డిస్ మిస్డు ఫర్ డిఫాల్టు.

గు—కోటిచింతల శేషయ్యా!

శేష—చిత్తము హాజరున్నానండి. మాప్లీడరుగారు వస్తూవున్నారండి. 2 నిమిషములు పురుసత్తు యిప్పించవలెనండి.

న్యాయా—నీతాలూకు ఆ స్త్రీ యెందుకు జప్తుచేయకూడదు?

శేష—చిత్తము ఆఆ స్త్రీలో ప్రతివాదికి యేమిసంబంధం లేదండి. నాతాలూకు దస్తావేజులన్ని దాఖలుచేసినాను నేనుచెప్పకోలేనండి. కొంచముసేపు తాళండి.

అంతలో నీలకంఠంగారు ప్రవేశించుచున్నారు.

నీల—గుడ్ మార్నింగుసార్. రంగయ్యాపంతులుగారు వస్తూవున్నారు. ఆయనను నేను రిప్రజెంటు చేస్తాను. దీనిలోనిసంగతులు నాకు తెలియవు. కొంచెముసేపు ఆపుచేయించవలెను.

న్యాయమూ—నో! నో! మాకోర్టులో ఒకరిని ఒకరు రిప్రిజంటు చేయడానికి వల్లకాదు. పిటీషను త్రోసివేస్తాను.

శేష—అయ్యో! అయ్యో! నేనుపేదవాడను ఇదివర్కు నాకు ప్రయివేటుఖర్చులు బోలెడైనవి. పబ్లిక్కుఖర్చులైనవి బాబు! రచ్చించాలి. ఊరుకుంటావేమయ్యా గుమాస్తాగారు! నాచేత కోర్టుగుమాస్తాలందరికి తలఒకరూపాయి లంచమిప్పించి ఈమేల ఉత్తరువువేయిస్తానని చెప్పి నీవు రెండురూపాయలుకడతేర్చె ప్లీడరుఫీజు అంతా యిదివరకే లాగివేసి యిప్పుడు జడ్జీగారు నాపిటీషను త్రోసివేస్తామంటె క్రిందనించుని నీవు మాట్లాడవు. బెంచిమీదకూర్చుని కోర్టుగుమాస్తామాట్లాడడు, ప్లీడరు అసలేరాడాయెను. ఇదేమిటయ్యా అన్యాయము.

న్యాయ—ఇందులో నీవు యెవరెవరికి యేమిలంచాలుయిచ్చినావు చెప్పు.

ప్లీ॥గు—(పార్టీనిచాటుకుపిలిచి) లంచముఇచ్చినానంటె నిన్ను జైలుకు పంపించెదరు ఆలాఅనకు.

శే—బాబు! నేనుయెవరికీయిప్పించలేదండి. మాఊరుబేమ్మను యేజెంటుగా తిరుగుతూఉంటాడు అయిన పెయివేటుఅనిచెప్పి నాదగ్గిర పదరూపాయలు పట్టుకొనివెళ్ళినాడు.

న్యా—నీవు నిజముచెప్పలేదుగనుక నీపిటీషను త్రోసివేసినాను.పో

శేష—(నెత్తి నోరు మోదుకొనుచు) అన్యాయము జరిగిందండి. నాకు చాలానష్టము, రచ్చించాలండి.

న్యాయ—ఎవరోయిబంట్రోతు గెంటు వీణ్ని ఆవతలకుగెంటు.

బంట్రో—చిత్తము. పోవోయి! అవతలికిపో! మీప్లీడరుగారింటికి పోయి మొత్తుకో. (అని అవతలకు గెంటుచున్నాడు.)

అంతరంగయ్యపంతులు ప్రవేశించుచున్నాడు.

శేష—(బిగ్గరగాయేడ్చుచు) అయ్యా! రంగయ్యబాబు నాకొంప తీసివేసినావయ్యా! మున్సీబుగార్కి మీకు స్నేహమంటిరి. ఆగుమాస్తాగా రిద్వారా మున్సీబుగార్కి యిప్పిస్తానని వందరూపాయలు పుచ్చుకొంటిరి. ఫీజుఅని 50 రూపాయలు పుచ్చుకొంటిరి. ఆపిృయివేట్లుఅని రు 10 పుచ్చుకొంటిరి. మల్లయ్య, మీరు నాకొంపతీసివేస్తిరి. నేనుచిరకాలమునుంచి ముష్టియెత్తి సంపాదించిన ద్రివ్యములోకొనుక్కున్న మూడుయకరములభూమి ముక్కలై పోయినది.

రంగ—అరవకురా! నీయిల్లుమూసిపోను? మున్సీబుగారువింటే తంటావస్తుంది. నేను సర్దుబాటుచేసెదను (తనగుమాస్తానుచూచి)ఏమయ్యాడిఫాల్టు రద్దుచేయమని పిటీషను అఫిడెవిట్టుతోకూడా తీసుకొనిరా పో!

ప్లీ॥గు—చిత్తము (అని పార్టీతో వెళ్లుచున్నాడు.)

నీల—రంగయ్యగారు నేను చెప్పినను వినక మీపిటీషను తోసివేసినారు.

రంగ—ప్రిభువుచిత్తము ఆలావున్నది. మనము ఏమిచేసెదము. (అంతలో పిటీషను అఫిడెవిట్టుతో గుమాస్తా ప్రివేశించుచున్నాడు.)

న్యాయా—ఇక వారంటుయిలాకా ఆపుచేయవలసినది. సూట్సు క్లార్కును రికార్డుతో పంపించుము.

గు—చిత్తము. (అని నిష్క్రిమించుచున్నాడు)

రంగ—(పిటీషను చేతపట్టుకొని బెంచిదగ్గరకు వెళ్ళుచున్నాడు)

న్యాయా—మీసీటులోనికి వెళ్ళండయ్యా; బెంచివద్దకు రాకూడదు

రంగ—చిత్తము, (అనిరెండడుగులు వెనుకకునడచి) తమరు వచ్చిన రెండేళ్ళనుంచి తమరొక తండ్రిలు, మేము బిడ్డలముగా సంచరిస్తూవున్నాము. మావల్ల యేలోటుపాట్లు వచ్చినా తమరు కనిపెట్టి పరిపాలన చేస్తూవున్నారు?

న్యాయా—ఆలావుండేవాళ్ళకు రోజులు కావయ్యాయివి. ఎప్పటికప్పటికి పట్టుకత్తిరించినట్లు కత్తిరిస్తూవుంటేనేకాని మంచివాళ్ళను పేరు రాదు. మెత్తనివాణ్ని చూస్తే మొత్తబుద్ధి అవుతుందని నాసాత్త్వికవృత్తి నిబట్టియేనన్ను శోకువచేస్తూవున్నారు. మీప్లీడర్లు సర్వసములు. ఏలావీలయితే ఆలామాట్లాడుతారు. పైకోర్టుకు పిటీషనులు, ఆకాశరామన్నగారి చేత పంపిస్తూవుంటారు.

రంగ—చిత్తము. దానివిషయమైయే తమతో మనవిచేస్తూవున్నాను. నేను గుంటూరువెళ్ళి యిప్పుడే వచ్చినాను, అక్కడ జడ్జీగారివద్ద తమప్రశంసయే వచ్చినది. నేను చెప్పినమాటలపైన వారియభిప్రాయము మారినది. మీపైన పిటీషన్లు కొట్టివేసినారు. తపశీలంతా తమతో ఆనక మనవిచేస్తాను.

న్యాయా—(చిరునవ్వుతో) ఈలాటి తుంటరిపిటీషనులు మమ్మేల నేమిచేస్తాయి. అందుకోసమై నాకేమివిచారము యెప్పుడు కలుగలేదు. కాని మనవాళ్ల దురాగతమునకు యోచిస్తూన్నానులెండి.

రంగ—(మరల బెంచివద్దకుపోయి) చిత్తము. ఈరోజున రైలు దిగి 12 మైళ్ళు బండిమీద వచ్చేసరికి కోర్టువేళ అయినది. భోజనము చేస్తూవుండగా నాతాలూకు వారంటుయిలాకా పిటీషను పిలిచినట్లున్ను డిఫాల్టుక్రింద కొట్టివేసినట్లున్ను పార్టీ చెప్పుచున్నాడు. అది కటాక్షించి రిస్టోరు చేయించమని ప్రార్థనతో యీపిటీషను ఇచ్చుకొంటూ వున్నాను.

న్యాయా—కోర్టువారు టైము కాకుండావచ్చి మీపిటీషనులు కొట్టివేసినారనియా మీయభిప్రాయము. ఆలాటి రిమార్కులు కోర్టువారు సహింపరని ఎరుగరా?

రంగ—చిత్తము. ఆలాంటి యభిప్రాయము నాకెన్నడున్ను లేదండి. నేనే ఆలస్యముగా వచ్చినాను. నాగడియారము తప్పు! 'మాకు కోర్టువారు యెప్పుడు వస్తే అప్పుడే టైము. ఈదఫాకి క్షమించి పిటీషను తిరిగి ఫయిల్‌లోనికి చేర్చవలెనండి.

న్యా—(నవ్వుచూ) అందరికి నేను లోకువ నాకు నంబికొండాయ లోకువఅన్నట్లు, ముందుగా మీపిటీషనే కొట్టివేయబడినదా! సరే. పిటీషను యివ్వండి. రిస్టోరు చేస్తాను.

రంగ—పిటిషను ఇచ్చుచున్నాడు.

న్యాయా—రిస్టోరుచేసి తిరుగా వాయిదావేస్తూన్నారు.

[అంతలో సీతారామశర్మయును, వెంకన్నపంతులును మరికొందరు ప్లీడర్లు ను ప్రవేశించుచున్నారు]

రంగ—కోటిచింతల శేషయ్యా! కోర్టువారు కరుణించి నీపిటీషను తిరుగా ఫయిలువేసుకొని విచారణకు వాయిదా వేసినారు. సాక్షిపేరస్తు దాఖలుచేయుటకు సొమ్ము యిచ్చి వెళ్ళిపో.

శేష—(సంతోషముతో) పీడరంటె రంగయ్యబాబే పీడరుగాని తక్కినవాళ్ళు పీడర్లా! చచ్చిపోయినవాళ్లను బ్రతికించేశక్తి యీయనకు ఒక్కనికే ఉన్నది. ఈయనవట్టిమానుకు చిగురు పుట్టించగలడు. ఈము న్సీబుగార్కి యీయనకు ఒకటే ప్రాణము. లేకుంటె యవరిమాట వినక కస్సు, బుస్సు అనే ప్రభువు యీయనరావడముతోనే రెండుమాటలుచెప్ప గానే మేకపిల్ల అయిపోయినాడు. బాబు! ఆలాగె సొమ్మిచ్చి వెళ్లెదను. నాభారమంతా మీదె సుమండి.

రంగ—సరే. పో.

సీతా—(కోర్టువారినుద్దేశించి) కోర్టువారు నేటిదినము మామూ లుకంటె కొంచెము త్వరగా దయచేసినారు. వచ్చినవెంటనే వట్టికూటి గంగయ్యతాలూకు వారంటుదరఖాస్తును గూర్చి వానిని పిలిపించినారు అతను నాకోసంయింటికి వచ్చినాడు. నేను వచ్చేలోగానే దరఖాస్తు తగ్గిం చినట్లు తెలిసినది. ఈదరఖాస్తు పోయేయెడల డిక్రీకి కాలదోషము పట్టు తుంది. పార్టీకి చాలానష్టము వస్తుంది. గనుక యీపిటీషను మన్నించి రిపోర్టు రద్దుచేయుమని ప్రార్థన. (అని పిటీషను యిచ్చుచున్నాడు)